
అనుదినం.. జనస్వరం
నిజామాబాద్-కామారెడ్డి
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక



08 పేజీలు | శుక్రవారం 14 ఏప్రిల్ 2023 | www.navatelangana.com

దేశం గర్వించేలా.. అంబేద్కర్ విగ్రహం

- జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ షిండే
- మాగి, గొర్గల్ గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహాల ఆవిష్కరణ

3లో..



అంబేద్కర్ 132వ జయంతి పురస్కరించుకొని నవతెలంగాణ ప్రత్యేక సంచిక

అంటరానితనం, వివక్షపై
అసమాన్య పోరు

- నేడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి
- పీడిత ప్రజల ఆశాజ్యోతి
- కులాలకు అతీతంగా నివాళులు

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

భారతదేశంలో వేళ్లూనుకున్న కుల వ్యవస్థ, అంటరానితనం, వివక్షపై అసామాన్య పోరు చేసిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఏర్పాట్లు పూర్తయ్యాయి. వాడవాడలా అంబేద్కర్ విగ్రహాలను ముస్తాబు చేశారు. భారత రాజ్యాంగ సృష్టికర్త, పేదల, బడుగుల, అట్టడుగ వర్గాల ఉన్నతికి తన జీవితాంతం పాటుపడిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 132వ జయంతి నేడు. దళిత మహర్ కుటుంబంలో జన్మించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్.. చిన్నప్పటి నుంచి వివక్షను ఎదుర్కొన్నాడు. విద్యాభ్యాసంలో అంటరానితనం చవిచూశారు. కానీ ఏనాడూ తన లక్ష్య సాధనలో వెనక్కు తగ్గకుండా భారతదేశ న్యాయశాఖ మంత్రిగా ఎదిగారు. భారత రాజ్యాంగాన్ని సృష్టించి ఈ జాతికి అంకితం చేశారు.

భీమ్‌రావ్ రామ్‌జీ అంబేద్కర్ జననం ఏప్రిల్ 14, 1891, మోవ్ గ్రామంలో జరిగింది. అయితే మహర్ కులంలో జన్మించినందుకు అంబేద్కర్‌ను అంటరానివానిగా ముద్రించి తీవ్రమైన వివక్ష చూపారు. కానీ 1907లో భీంరావు బొంబాయి విశ్వవిద్యాలయం నుంచి మెట్రిక్యులేషన్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించారు. తరువాత 1913లో బొంబాయి విశ్వవిద్యాల యం నుంచి పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్‌లో పట్టభద్రులయ్యారు. ఆ సమయంలోనే అంబేద్కర్ తండ్రి మరణించారు. చాలా విపత్కర పరిస్థితుల్లో ఉన్నప్పటికీ.. కొలంబియా విశ్వవిద్యాలయంలో తదుపరి చదువుల కోసం యూఎస్‌ఏ వెళ్లాలని నిర్ణయించుకున్నారు. బరోడా మహారాజ్ బరోడా (ప్రస్తుతం వడోదర) గైక్వార్ (పాలకుడు)చే స్కాలర్‌షిప్ అందుకున్నాడు. 1913 నుంచి 1917 వరకు, 1920-23 వరకు యునైటెడ్ స్టేట్స్, బ్రిటన్, జర్మనీలోని విశ్వవిద్యాలయాలలో ఉన్నతాభ్యాసం పూర్తి చేశారు.

1923లో ఏప్రిల్‌లో తిరిగి భారతదేశానికి వచ్చిన తరువాత అంటరాని-అణగారిన వర్గాల తరపున అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాటం చేశారు. ఈ యేడాదిలోనే అణగారిన వర్గాల్లో విద్య-సంస్కృతి వ్యాప్తి చేయడం, ఆర్థిక స్థితిని మెరుగుపరచడం కోసం ఏకంగా 'బహిష్కృత్ హితకారిణి సభ(బహిష్కృత సంక్షేమ సంఘం)ని స్థాపించారు. ఇక బీఆర్ అంబేద్కర్ పోరాటంలో ముఖ్యమైనది 1927లో చౌదర్ ట్యాంక్ వద్ద మహాద్ మార్చ్‌కు నాయకత్వం వహించారు. ఇది కుల వ్యతిరేక, అర్చకుల వ్యతిరేక ఉద్యమానికి నాంది పలికింది. 1930లో డాక్టర్ అంబేద్కర్ నాసిక్‌లోని మిగతా 2లో..

ఉద్యమాల వేదిక.. ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ కమిటీ

- అభాగ్యులకు అండగా నిలుస్తున్న కమిటీ ప్రతినిధులు
- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంకై ఢిల్లీలో నిరసన
- వరంగల్ మహాసభకు వేల మందితో తరలి..

3లో..



అట్టడుగు వర్గాల అభ్యున్నతికి పాటుపడిన అంబేద్కర్

- దేశంలోనే మొదటి పథకం దళిత బంధు
- ఆర్మూర్ ఎంపీపీ పస్కా నర్సయ్య

నవతెలంగాణ-ఆర్మూర్

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అట్టడుగు వర్గాల అభ్యున్నతికి పాటుపడ్డారు. నేడు అంబేద్కర్ 132వ జయంతి. నేడు బిజెపి ప్రభుత్వం అంబేద్కర్ కల్పించిన హక్కులు, రిజర్వేషన్లు కాలరాస్తుంది. మతములన్నియు మాసిపోవును జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును అని గురజాడ అన్నట్లు జ్ఞానం ద్వారానే జీవితానికి వెలుగు, విద్య ద్వారానే అసమానతలు, అంతరాలు తొలగిపోతాయని రిజర్వేషన్ ఫలాలు అందించి అణగారిన వర్గాల విద్యకు నోచుకునేలా అంబేద్కర్ కృషి చేశారు. నేడు కుల దురహంకార హత్యలు పెరిగాయి. కులాంతర వివాహాలను ప్రోత్సహించాలి. ప్రైవేట్ రంగంలో కూడా రిజర్వేషన్లు తీసుకురావాలి. పార్లమెంటుకు అంబేద్కర్ పేరు పెట్టాలి. శక్తివంతమైన, ఆరోగ్యకరమైన సమ్మిళిత సమాజ నిర్మాణానికి దోహదం చేసేమార్గదర్శక ప్రణాళికను దార్శనికతను కాలానుగుణమైన చైతన్య శీల స్ఫూర్తిని రాజ్యాంగం ద్వారా అందించారు.

దేశంలోనే మొదటి పథకం దళిత బంధు

గత ప్రభుత్వాలు దళితులను పట్టించుకున్న పాపాన పోలేదు. దళితులు ఎంతో కష్టపడేవారు. వారు. పేదరికంలో ఉండకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి కేసీఆర్ దళిత బంధు పథకాన్ని అమలు చేశారు. అంబేద్కర్ స్ఫూర్తితో కేసీఆర్ ముందుకు వచ్చి ఆర్థిక చేయూతనందించే దళిత బంధు పథకానికి శ్రీకారం చుట్టి దళితుల జీవితాల్లో వెలుగులు నింపారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని నేటి కేంద్ర ప్రభుత్వం తుంగలో తొక్కి తమ ఇష్టానుసారం మార్పులు చేర్పులు చేసుకుంటూ పాలన కొనసాగిస్తున్నారు.

దేశంలోనే ఎత్తయిన అంబేద్కర్ విగ్రహం...

తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహం దేశంలోనే ఎత్తైన విగ్రహం. నేడు ముఖ్యమంత్రి కెసిఆర్ చేతుల మీదుగా ఆవిష్కరించడం ఆ మహనీయుడు దేశానికి చేసిన కృషి



సాధించిన విజయాలే ఆయన వ్యక్తిత్వానికి ప్రతీక. ఈ విగ్రహం భావితరాలకు ఆత్మవిశ్వాసం కలిగిస్తూ ఆత్మగౌరవాన్ని నిలబెడుతుంది.

దళితుల పెన్నిధి సీఎం కేసీఆర్

- మిర్జాపల్లి సర్పంచ్, ఉపసర్పంచ్

సాయిలత, మధువర్మ



నవతెలంగాణ-ఆర్మూర్

దళితుల పాలిట పెన్నిధి ముఖ్యమంత్రి కేసీఆర్ అని ప్రజల సంక్షేమం కోసం నిర్విరామంగా కృషి చేస్తున్న తెలంగాణ ప్రభుత్వం నేడు హుస్సేన్ సాగర్ తీరంలో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ ముఖ్యమంత్రి చేయడం రాజ్యాంగ నిర్మాతకు మనం అర్పించే ఘన నివాళులు. అంటరాని, అణగారిన వర్గాల తరఫున అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాటం ప్రారంభించిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జాగీరా-- వ్యవస్థను రద్దు చేయవలసిన అవసరాన్ని నొక్కి చెప్పిన మేధావి. నేడు పలుచోట్ల దళితుల పట్ల అణగరిన వర్గాల పట్ల మహిళల పట్ల వివక్ష అంటరానితనం కొనసాగుతుంది. అది నివారించగలిగినప్పుడే సామాజిక వివక్ష తొలిగి అందరికీ సమాన ఫలితాలు అందుతాయి. అంబేద్కర్ కన్న కలల నిజం అవుతాయి. పీయూసీ చైర్మన్, బి ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షులు ,,ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి హయాంలో అనేక అభివృద్ధి పనులు జరుగుతునా--యి.

అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు అపూర్వ ఘట్టం

- రాంపూర్ గ్రామ సర్పంచ్ బంటు దయానంద్



నవతెలంగాణ-ఆర్మూర్

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహం దేశంలోనే ఎత్తైనదిగా నేడు ముఖ్యమంత్రి కేసీఆర్ ఆవిష్కరించడం శుభ సూచకం. నియోజకవర్గం నుండి ప్రజలు ఈ కార్యక్రమంలో భాగస్వాములు అయ్యేందుకు బస్సులను ఏర్పాటు చేశాం. అంబేద్కర్ అందరికీ విద్య నేర్చుకునే అవకాశం కల్పించారు. ఆయన గొప్ప మేధావి. ఆయన ఆశయాలకు అనుగుణంగా నడవాలి.

16న చలో నిజామాబాద్

- బహుజన విద్యావంతుల వేదిక



నవతెలంగాణ-కంఠేశ్వర్

బహుజన విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో బహుజన మహనీయుల జయంతి ఉత్సవాలను ఈనెల 16న నిజామాబాద్‌లోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో నిర్వహించడం జరుగుతుందని బహుజన విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షులు యాట ప్రతాప్ తెలిపారు. నగరంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉదయం 10 గంటలకు పూలాంగ్ లోని అంబేద్కర్ చౌరస్తా నుండి రాజీవ్ గాంధీ ఆడిటోరియం వరకు బైక్ ర్యాలీ ఉంటుందని తెలిపారు. ఈసెమినార్లో జిల్లాలోని బహుజన విద్యావంతులు, మేధావులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో షేక్ హుస్సేన్ జైహెచ్ నాయకులు అల్లోట్. రవీందర్, సీనియర్ న్యాయవాది, ఎస్ రంజిత్-న్యాయవాది, బహుజన విద్యావంతుల వేదిక జిల్లా కార్యవర్గ సభ్యులు సిహెచ్. గంగాధర్, ఎస్. ఉదయ్ కుమార్, వి.సాయన్న, పి.గంగాధర్, బి.లక్ష్మణ్, పి. లక్ష్మణ్ పాల్గొన్నారు.

మహనీయుల జయంతి ఉత్సవాల పోస్టర్లు ఆవిష్కరణ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలో అంబేద్కర్ స్టూడెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే మహనీయుల జయంతి ఉత్సవాల పోస్టర్లను తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ డి రవిందర్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు నిఖిల్ మాట్లాడుతూ.. ఈనెల 20 జరిగే మహనీయుల జయంతి ఉత్సవాలకు పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విద్యార్థులు, సంఘం నాయకులు పాల్గొన్నారు.

అంటరానితనం, వివక్షపై

అసమాన్య పోరు

మొదటిపేజీ తరువాయి

కాలరామ్ ఆలయంలో ప్రారంభించిన ఆలయ ప్రవేశ ఉద్యమం మానవ హక్కులు-సామాజిక న్యాయం కోసం పోరాటంలో ఒక మైలురాయిగా నిలిచింది. 1932లో డాక్టర్ అంబేద్కర్-గాంధీ ఒక అవగాహనకు వచ్చారు. ఇది ప్రసిద్ధ పునా ఒప్పందంగా మారింది. ఈ ఒడంబడిక ప్రకారం ఎన్నికల నియోజకవర్గాలపై ఒప్పందంలో పాటు, అంటరాని వారికి ప్రభుత్వ ఉద్యోగాలు, శాసనసభలలో రిజర్వేషన్లు కల్పించారు. ప్రత్యేక ఓటర్ల ఏర్పాటును రద్దు చేశారు. ఈ ఒప్పందం దేశ రాజకీయ రంగంలో అణగారిన వర్గాలకు స్పష్టమైన, ఖచ్చితమైన స్థానం కల్పించింది. విద్య, ప్రభుత్వ సేవల అవకాశాలను కల్పించింది. ఓటు హక్కు దక్కింది. కొంతకాలం తరువాత డాక్టర్ అంబేద్కర్ ఇండిపెండెంట్ లేబర్ పార్టీని స్థాపించారు. ప్రాంతీయ ఎన్నికల్లో పాల్గొని బొంబాయి శాసనసభకు ఎన్నికయ్యారు. అతను జాగీర్దారీ వ్యవస్థ రద్దు చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. 1947లో స్వాతంత్ర్యం వచ్చినప్పుడు మొదటి న్యాయశాఖ మంత్రిగా ఎన్నికయ్యారు. హిందూ కోడ్ బిల్లుపై డాక్టర్ అంబేద్కర్‌కు, ప్రభుత్వంతో అభిప్రాయ బేధాలు తలెత్తాయి. దీంతో న్యాయశాఖ మంత్రి పదవికి రాజీనామా చేశారు.ఆ తరువాత రాజ్యాంగ ముసాయిదా కమిటీకి అంబేద్కర్ ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. 1948లో రాజ్యాంగ రూపకల్పన పూర్తి చేసి రాజ్యాంగ సభలో సమర్పించారు. 1949లో ఈ ముసాయిదా చాలా తక్కువ సవరణలతో ఆమోదం పొందింది. అయితే హిందూ మతంలో కొనసాగుతున్న అంటరానితనం, వివక్షకు వ్యతిరేకంగా అక్టోబర్ 14, 1956లో బీఆర్ అంబేద్కర్ ఆయన అనుచరులతో బౌద్ధమతాన్ని స్వీకరించారు. అంబేద్కర్ జీవితంలో అనేక



అవార్డులు దక్కాయి. బోధిసత్వ (1956), భారతరత్న (1990), మొదటి కొలంబియన్ అహెడ్ ఆఫ్ దేర్ టైమ్ (2004), ది గ్రేటెస్ట్ ఇండియన్ (2012) ముఖ్యమైనవి.

బహిష్కృత హితకారిణి సభ, సమతా సైనిక్ దళ్ ఏర్పాటు చేసి సామాజిక రంగంలో అనేక కార్యక్రమాలు చేపట్టారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అసలు ఇంటిపేరు అంబావాడేకర్. కానీ అతని గురువు మహదేవ్ అంబేద్కర్ అతనికి పాఠశాల రికార్డులలో అంబేద్కర్‌గా ఇంటిపేరు పెట్టారు. విదేశాల నుంచి ఆర్థికశాస్త్రంలో డాక్టరేట్ (పిహెచ్‌డి) పట్టా పొందిన మొదటి భారతీయుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కావడం విశేషం. లండన్ మ్యూజియంలో విగ్రహం ఉన్న ఏకైక భారతీయుడు కూడా డాక్టర్ అంబేద్కర్. భారత త్రివర్ణ పతాకంలో "అశోకచక్ర"కు స్థానం కల్పించిన ఘనత కూడా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌కే దక్కుతుంది. మధ్యప్రదేశ్, బీహార్‌ల మెరుగైన అభివృద్ధి కోసం, బాబాసాహెబ్ ఈ రాష్ట్రాల విభజనను 1950లలో ప్రతిపాదించారు. అయితే 2000 తర్వాత మధ్యప్రదేశ్, బీహార్‌లను విభజించి ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్‌లుగా ఏర్పాటు చేశారు. బాబాసాహెబ్ వ్యక్తిగత లైబ్రరీ "రాజగీర్"లో 50,000 కంటే ఎక్కువ పుస్తకాలున్నాయి. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ప్రయివేట్ లైబ్రరీ. డాక్టర్ బాబాసాహెబ్ రచించిన "వెయిటింగ్ ఫర్ ఎ వీసా" పుస్తకం కొలంబియా యూనివర్సిటీలో పాఠ్య పుస్తకంగా ఉంది. కొలంబియా విశ్వవిద్యాలయం 2004లో ప్రపంచంలోని అగ్రశ్రేణి 100 మంది పండితుల జాబితాను రూపొందించింది. ఆ జాబితాలో మొదటి పేరు డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్‌ది కావడం విశేషం. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 64 సబ్జెక్టులలో మాస్టర్. హిందీ, పాళీ, సంస్కృతం, ఇంగ్లీషు, ఫ్రెంచ్, జర్మన్, మరాఠీ, పర్షియన్, గుజరాతీ వంటి 9 భాషలపై ఆయనకు అవగాహన ఉంది . ఇది కాకుండా, అతను దాదాపు 21 సంవత్సరాల పాటు ప్రపంచంలోని అన్ని మతాలను తులనాత్మకంగా అధ్యయనం చేశారు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో బాబాసాహెబ్ 8 సంవత్సరాల చదువును కేవలం 2 సంవత్సరాల 3 నెలల్లో పూర్తి చేశారు. ఇందుకోసం రోజుకు 21 గంటలు చదువుకున్నారు. డా. బాబాసాహెబ్ అంబేద్కర్ తన 8,50,000 మంది మద్దతుదారులతో బౌద్ధమతంలోకి ప్రవేశించారు. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద మతమార్పిడి. బాబాసాహెబ్‌ను గొప్ప బౌద్ధ సన్యాసి "మహంత్ వీర్ చంద్రమణి" "ఈ యుగపు ఆధునిక బుద్ధుడు" అని పిలిచారు.

ఉద్యమాల వేదిక..

ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ కమిటీ

అభాగ్యులకు అండగా నిలుస్తున్న కమిటీ ప్రతినిధులు

- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంకై ఢిల్లీలో నిరసన
- వరంగల్ మహాసభకు వేల మందితో తరలి..

నేటి కాలంలో ఎన్నో సంస్థలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నా వాటి కార్యచరణ మాత్రం కనపడదు. సమాజంలో జరిగే అసమానతలపై, అన్యాయాలపై, అక్రమాలపై ప్రశ్నిస్తూ అభాగ్యులకు అండగా నిలుస్తోంది ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ కమిటీ. బోధన్ డివిజన్ వేదికగా 2014 సంవత్సరంలో ఏర్పడిన ఈ పరిరక్షణ కమిటీ ఆపత్కాలంలో ఎందరికో అండగా నిలిచింది. బోధన్ డివిజన్‌లో దళితుల పట్ల జరుగుతున్న అంటరానితనం, వివక్షను ఎదిరిస్తూ అండగా ఉంది. అగ్రవర్ణాల దాడులను ఎదిరిస్తూ, బాధితులకు బాసటగా నిలిచింది. ఈ కమిటీ గౌరవ అధ్యక్షులుగా పరిమి కోటేశ్వరరావు, ముఖ్య సలహాదారులుగా కోండ్ర వెంకటి, వాగ్మారే సూర్యకాంత్, బానోత్ లచ్చిరాం, ప్రధాన కార్యదర్శిగా నెమలి సంజీవ్, కన్వీనర్‌గా నీరడి ఈశ్వర్, ఉపాధ్యక్షులుగా సింగడి పాండు, నీరడి రవి నేతృత్వంలో ఆవిర్భవించింది. -నవతెలంగాణ, బోధన్



ఎన్ఆర్‌సీకి వ్యతిరేకంగా ఉద్యమం..

సాధించిన విజయాలు..

ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ కమిటీ ఏర్పడిన తర్వాత కమిటీ ఆధ్వర్యంలో బోధన్ పట్టణంలో 2019 సంవత్సరంలో నిర్వహించిన మహనీయుల జయంతి ఉత్సవాలకు బోధన్ డివిజన్ నుంచి అశేష జనం 8 వేల మంది వరకు హాజరు కావడంతో సంచలనంగా మారింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ప్రజలు ఈ సభకు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఎస్సీ, ఎస్టీ చట్టంలోని నిబంధనలు మార్చి కేసు తీవ్రతను సడలిస్తున్నట్లు సుప్రీంకోర్టు పేర్కొనడంతో ఎస్సీ, ఎస్టీ చట్టం యధావిధిగా ఉండేలా దేశవ్యాప్తంగా జరిగిన ఉద్యమంలో ఈ కమిటీ భాగస్వామియై ఢిల్లీలో జరిగిన మహాధర్నాలో పాల్గొని తమ సత్తాను చాటింది. ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని యధావిధిగా ఉండేలా బిల్లు ఆమోదించాలని కోరుతూ వరంగల్‌లో ఎంఆర్పీఎస్ జాతీయ నాయకులు మందకృష్ణ మాదిగ, మాలమహానాడు జాతీయ నాయకులు చెన్నయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కాపాడుకోవడానికి నిర్వహించిన సభలో బోధన్ డివిజన్ నుంచి 1200 మంది ప్రజలను తరలించి తమ ప్రతాపం చూపారు. ఢిల్లీలో జరిగిన మహాధర్నాకు ఈ కమిటీ ప్రతినిధులు బస్సులో తరలివెళ్లి మూడు రోజుల పాటు ధర్నాలో పాల్గొన్నారు. ఉద్యమంలో భాగంగా పార్లమెంటులో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని యధావిధిగా అమలు చేయడానికి నిర్ణయించినట్లు కేంద్ర ప్రభుత్వం బిల్లు ఆమోదించడంతో నాయకులు ఢిల్లీ నుంచి బోధన్‌కు తిరిగివచ్చారు.

అలాగే బోధన్ డివిజన్‌లో అగ్రవర్ణాల బాధితులకు అండగా నిలుస్తూ చైతన్య కార్యక్రమాలు నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులలో నిందితులకు తక్షణమే శిక్షపడేలా అరెస్టు చేయాలని కోరుతూ డీజీపీకి వినతిపత్రం ఇచ్చారు. బోధన్ మాజీ మున్సిపల్ చైర్మన్ ఎల్లయ్యపై అవిశ్వాస తీర్మానానికి కుట్రలు చేయడంతో ఈ కమిటీ నిర్వాహకులు బోధన్ పట్టణంలో ఉద్యమానికి పిలుపునిచ్చారు. దాంతో భారీ సంఖ్యలో దళిత ప్రజలు నిరసన చేయడంతో అవిశ్వాస తీర్మానాన్ని విరమించవలసి వచ్చింది. అలాగే 2019లో అంబేద్కర్ జయంతి సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ముస్లిం, మైనారిటీలకు వ్యతిరేకంగా వచ్చిన ఎన్ఆర్సీ బిల్లుపై ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ కమిటీ ప్రతినిధులు బోధన్ జూనియర్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన మహాసభలో పాల్గొని ముస్లింలకు అండగా నిలిచారు. 2018లో సుంకిని గ్రామంలో డబుల్ బెడ్ రూమ్ ఇవ్వాలని కోరుతూ నిరుపేద దళితుడు ఆత్మహత్య చేసుకుంటే ఆ కుటుంబానికి పూర్తి అండగా నిలిచి మద్దతు ప్రకటించారు. 2021లో చిన్నారి చైత్రపై జరిగిన లైంగిక దాడికి నిరసనగా కోటగిరి మండలంలో కొవ్వొత్తుల ర్యాలీ, నిరసన కార్యక్రమం చేపట్టారు. అలాగే మహనీయుల జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తూ మహనీయుల ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళు తున్నారు. ఈ నెల 30వ తేదీన బోధన్ పట్టణంలో నిర్వహించే మహనీయుల జయంతికి బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ లాంటి పెద్దలను ఆహ్వానిస్తున్నారు. అలాగే బోధన్ డివిజన్ నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గ ప్రజలను భారీ సంఖ్యలో తరించడానికి సమయతమవుతున్నారు. ఏదేమైనా ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ కమిటీ బాధిత కుటుంబాలకు అండగా నిలవడం కాకుండా ప్రజల పక్షాన ఉద్యమిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి చేరేలా కృషి చేస్తున్నారు.



ఢిల్లీ నిరసనలో..

దేశం గర్వించేలా.. అంబేద్కర్ విగ్రహం

- జుక్కల్ ఎమ్మెల్యే హన్మంతు షిండే
- మాగి, గొర్గల్ గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహాల ఆవిష్కరణ

నవతెలంగాణ-నిజాంసాగర్

యావత్తు దేశం గర్వించేలా భారతరత్న బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆయన జయంతి సందర్భంగా ఆవిష్కరించడం ఆనందంగా ఉందని జుక్కల్ ఎమ్మెల్యే హన్మంతు షిండే అన్నారు. మండలంలోని మాగి, గొర్గల్ గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహం అవిష్కరిం చేదుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత దళితులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని దళిత బంధు పథకం అమలు చేస్తున్నారని అన్నారు. అదేవిధంగా దేశంలో లేని అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. దీంతో తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని వివరించారు. అనంతరం పలు గ్రామాలకు చెందిన కళ్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం గార్గల్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ హాల్ రూ.10లక్షలతో నిర్మాణం చేపట్టగా ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మనోహర్, సీనియర్ నాయకులు దుర్గారెడ్డి, గంగారెడ్డి, సర్పంచులు కమ్మరింకత్త అంజయ్య, బాలమణి సాయిలు, రమేష్ గౌడ్, గానీ విఠల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే హన్మంత్‌షిండే

అంబేద్కర్ ఆశయ సాధనకు

ప్రతిఒక్కరూ కృషి చేయాలి

- ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్
- జైభీమ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ

నవతెలంగాణ-దోమకొండ

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ ఆశయం సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జైభీమ్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహం, కుర్మ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన దొడ్డి కొమురయ్య విగ్రహాలను ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమానికి అభివృద్ధికి సీఎం కేసీఆర్ ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ అంబేద్కర్ ఆశయం సాధనకు కృషి చేయాలని కోరారు. అనంతరం ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్‌ను నాయకులు ఆయా సంఘం సభ్యులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయం చైర్మన్ పున్న రాజేశ్వర్, జడ్పీ వైస్ చైర్మన్ ప్రేమ్ కుమార్, ఎంపీపీ శారదా, జడ్పీటీసీ తీర్మాల్‌గౌడ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మధుసూదన్ రావు, సర్పంచ్ అంజలి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సంఘం సభ్యులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్

అంటరానితనాన్ని రూపుమాపిన అంబేద్కర్..

- ప్రపంచంలోనే పెద్దజయంతి
- ఎల్లారెడ్డి బీఎస్పీ పార్టీ అధ్యక్షుడు బబ్లూ

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

అంటరానితనాన్ని రూపుమాపిన అంబేద్కర్ ఆదర్శవంతుడని ఎల్లారెడ్డి బీఎస్పీ పార్టీ అధ్యక్షుడు బబ్లూ అన్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద జయంతి అంబేద్కర్ జయంతి అని వివరించారు. శుక్రవారం అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో అత్యధిక విగ్రహాలు గల నాయకుడు అని అంబేద్కర్ అని తెలిపారు. ఆయన జయంతిని ప్రపంచం మొత్తం 293 దేశాల్లో జ్ఞాన దినోత్సవం జరుపుకుంటుందని, గాడ్ ఫాదర్ ఆఫ్ ఇండియా మోహోన్నత మైన వ్యక్తి అని అన్నారు.



ప్రపంచమే ఆయన జ్ఞానానికి సలాం కొడుతోందని, అది మనదేశానికే గర్వకారణమని అన్నారు. అంబేద్కర్‌ను మనందరి నాయకుడిగా కులాలకతీతంగా గుర్తించాలని కోరారు. అలాగే నేడు నిర్వహించే అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రక్తదానం చేయడానికి ముందుకు రావాలి

నవతెలంగాణ-రెంజల్

అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే రక్తదాన శిబిరంలో రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని బోధన్ నియోజకవర్గం రెడ్‌క్రాస్ సొసైటీ ఉపాధ్యక్షులు అశ్వక్ అహ్మద్ కోరారు.

మండలంలోని బోర్గం పాఠశాలలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు.

రాజ్యాంగాన్ని రక్షించుకుందాం

- సీఐటీయూ ఆధ్వర్యంలో పాదయాత్ర

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్

రాజ్యాంగాన్ని రక్షించుకుందాం! మనువాదాన్ని మట్టు పెడదాం! వాక్ ఫర్ సోషల్ జస్టిస్ 10 కే పేరుతో సామాజిక న్యాయం కోసం పది కిలోమీటర్లు పాదయాత్ర సీఐటీయూ ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించారు. దళితులు, గిరిజనులు, మహిళలు, మైనార్టీలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలు, కుల వివక్షలను వ్యతిరేకంగా పోరాడే ప్రజాసంఘాలకు అండగా కార్మిక వర్గం నిలవాలని కార్మికులు ఉద్యోగులు అంతా సంగీభావ ఉద్యమాలకు నిలబడాలని సిఐటియు జిల్లా కార్యదర్శి జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో దళితులపై మూడు రెట్లు హింస ఈ కాలంలో పెరిగిందని, మోడీ సొంత రాష్ట్రం గుజరాత్ లో వునా పట్టణంలో ఆవు మాంసం వలుస్తున్నారని నెపంతో నలుగురి దళిత యువకులను చెట్టు కట్టేసి కొట్టారని తెలిపారు. 'ఒక దళితుడు గుర్రం ఎక్కాడని కింద పడేసి కొట్టి చంపారు. బిజెపి ప్రభుత్వం వేల సంవత్సరాల నాటి బూజు పట్టిన మనువాద సిద్ధాంతాన్ని అమలు చేయాలని ప్రయత్నం చేస్తున్నదని మతం పేరుతో, దేశభక్తి ముసుగులో ప్రజలు, కార్మికుల్లో చిచ్చు పెడుతున్నది. దళితులు, గిరిజనులు, మహిళలపై విచ్చలవిడిగా దాడులు చేస్తున్నది. దీనికి వ్యతిరేకంగా సామాజిక న్యాయం కోసం పాదయాత్ర నిర్వహించామని తెలిపారు. బిజెపి కేంద్ర ప్రభుత్వం జాతీయ వనరులను ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా తన తాబేదారులకు కట్టబెడుతుంది. దీంతో ప్రభుత్వ రంగాన్ని మొత్తం ప్రయివేటుపరం చేయడం ద్వారా దళితులు, గిరిజనులు, బలహీన వర్గాలకు చెందిన బీసీలు రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లకు బిజెపి ప్రభుత్వం గండి కొడుతున్నది. నూతన విద్యా విధానం పేరుతో మనవాధ సిద్ధాంతాన్ని విద్యా విధానంలో చొపించి అమలు చేస్తున్నది. దీనికి వ్యతిరేకంగా అన్ని రంగాల కార్మికులు, రైతులు, కూలీలు, ప్రజలు, మేధావులు, ప్రజాతంత్ర వాదులు ఐక్యమై పెద్ద ఎత్తున ఉద్యమించి రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి .మనుధర్మాన్ని మట్టు పెట్టాలని పిలుపునిచ్చారు . ఈకార్యక్రమంలో రాజనర్సింహా, సత్యం, దేవరాజ్, వ్యవసాయకార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొత్త నర్సింహులు అర్జున్ నర్సవ్వ పాల్గొన్నారు.



పాదయాత్ర చేపట్టిన సీఐటీయూ నాయకులు

రిజర్వేషన్‌తోనే పదవి..

- రానాఖుర్దూ సర్పంచ్ బుయ్యు లత భూషణ్

నవతెలంగాణ-మోపాల్

అంబేద్కర్ ప్రవేశ పెట్టిన రిజర్వేషన్ వల్లనే తమకు సర్పంచ్ పదవి లభించిందని రానాఖుర్దూ సర్పంచ్ బుయ్యు లత భూషణ్ తెలిపారు. శుక్రవారం అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని నవతెలంగాణతో మాట్లాడారు. అంబేద్కర్ స్ఫూర్తితో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం దళితుల కోసం అన్నీ రకాల సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతుందని తెలిపారు.



బుయ్యు లత భూషణ్

నేడు బ్రాహ్మణపల్లిలో అంబేద్కర్, గౌతమ బుద్ధ విగ్రహాల ఆవిష్కరణ

- దళిత రత్న అవార్డు గ్రహీత సూర్యకాంత్ వాగ్మారే

నవతెలంగాణ-ఎడపల్లి



మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో శుక్రవారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహంతో పాటు గౌతమ బుద్ధ విగ్రహాలను ఆవిష్కరిస్తున్నట్టు మండలంలోని ఏఆర్‌పీ క్యాంప్ గ్రామానికి చెందిన దళిత రత్న అవార్డు గ్రహీత, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు సూర్యకాంత్ తెలిపారు. బోధన్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కెప్టెన్ కరుణాకర్‌రెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఏఆర్‌పీ క్యాంప్ గ్రామానికి చెందిన దళిత రత్న అవార్డు గ్రహీత, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు సూర్యకాంత్ వాగ్మరే, బోధన్ మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ అర్చన సూర్యకాంత్ వాగ్మారే గౌతమ బుద్ధ విగ్రహాన్ని దాత రూపంలో గ్రామస్తులకు అందించి ఏర్పాటు చేసి శుక్రవారం ఉదయం 11:30 నిమిషాలకు ప్రారంభించడం సంతోషంగా ఉందని బ్రాహ్మణపల్లి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి నిజామాబాద్ నగర మేయర్ దండు నీతు కిరణ్, సర్పంచ్ లక్ష్మి రాజేందర్ రెడ్డి, ఎంపీటీసీ సుధా నాగేందర్‌రెడ్డి, టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు అలుక కిషన్, నాయకులు శంకర్ నాయుడు, ఎడపల్లి సర్పంచ్ ఆకుల మాధవి శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ పోల మల్కారెడ్డి, మాజీ జెడ్పీటీసీ పులి శ్రీనివాస్ రావు, మాజీ వైస్ ఎంపీపీ బిల్లా రామ్మోహన్, మాజీ ఎంపీటీసీ బుడ్డ విజయలక్ష్మి పోశెట్టితో పాటు ప్రజాప్రతినిధులు దళితులు నాయకులు హాజరవుతున్నట్టు సూర్యకాంత్ తెలిపారు. అలాగే ఎడపల్లి మండలంలోని సాటాపూర్ గేట్ వద్ద డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా నిర్వహించనున్న వేడుకలను విజయవంతం చేయాలని వారు కోరారు.





ప్రతి గ్రామంలో అంబేద్కర్ విగ్రహముండాలి

- ప్రిన్సిపాల్ డాక్టర్ కే ప్రవీణ్ కుమార్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి



ప్రతి గ్రామంలో అంబేద్కర్ విగ్రహముండాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కే ప్రవీణ్ కుమార్ అన్నారు. గురువారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ప్రవీణ్‌కుమార్ అధ్యక్షత వహించారు. చరిత్ర అధ్యాపకులు అసిస్టెంట్ ప్రొఫెసర్ జయప్రకాష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. అంబేద్కర్ చదివిన చదువులు ప్రపంచంలో ఇంత వరకు ఎవరూ చదవలేదని తెలిపారు. అంబేద్కర్‌ను ప్రపంచ దేశాలు గుర్తించే విధంగా తన జీవితం ప్రభావం చేసిందని తెలిపారు. డాక్టర్ సిద్ధ లక్ష్మి అంబేద్కర్ జీవితంపై తన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. గోదావరి టీచర్ అంబేద్కర్ జీవిత ఆశయాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ప్రభాకర్ రావు, గంగారెడ్డి, సిద్దు రాజు, కృష్ణ ప్రసాద్, వినయ్‌కుమార్, శశిధర్, అరుణ్‌కుమార్, చంద్ర కాంత్, మోహిన్, రామకృష్ణ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.
















అంబేద్కర్ సూచించిన సామాజిక విముక్తి మార్గం



షేక్ కరిముల్లా,
సెల్: 9705450705



నేడు దళిత బహుజనులు ఓట్ల రాజకీయాలకు పావులుగా మారి సమిధలవుతున్నారు. పార్లమెంటరీ రాజకీయాల భ్రమల్లో నుంచి ఈ వర్గం బయటపడి అంబేద్కర్ సూచించిన ప్రత్యామ్నాయ రాజకీయాలు, సంస్కృతి, సాంఘిక విముక్తి, ఆర్థిక సమానత్వం, అణగారిన వర్గాలకు రాజకీయ అధికారం సాధించుకోవటానికి మనం నేడు ఆయన బాటలో నడవాల్సిన అవసరం ఉంది. బడుగు బలహీన వర్గాల ఉన్నతి కోసం అంబేద్కర్ ఎంతో తపనపడ్డారు.

ప్రజలకు అన్నం పెట్టే కీలక రంగమైన వ్యవసాయం పూర్తిగా ప్రభుత్వానికి చెందిన పరిశ్రమగా ప్రకటించాలని సూచించాడు. ప్రభుత్వం స్వయంగా నిర్వహించే పరిశ్రమలను భారత రాజ్యాంగంలో పొందుపరచాలని సూచించాడు. కీలక మౌలిక పరిశ్రమలు, వ్యవసాయక భూమి వాటిపై హక్కులను పరిహారమిచ్చి స్వాధీన పరచుకోవాలని సూచించాడు. భూమిని ఒక స్థిర ప్రమాణంలో విభజించి వ్యవసాయక పరిశ్రమలను వ్యవస్థీకరించాలని అన్నాడు. ఆ వ్యవసాయక క్షేత్రాలను సమిష్టి సహకార క్షేత్రాలుగా చేసి కుల, మత, బేధాలు లేకుండా ఏర్పడిన గ్రామ సమూహాలు సాగుచేయాలి. ఉత్పత్తిని సమిష్టిగా పంచుకోవాలి. భూస్వాములు, కౌలుదారులు, భూమిలేని కూలీలు ఉండరాదు. మొత్తంగా ఈ సమిష్టి వ్యవసాయ క్షేత్రాలకు ధనం, సదుపాయం మొదలైన వనరులను ప్రభుత్వమే సమకూర్చాలి. తద్వారా ఉత్పాదకతను పెంచాలి. ప్రజల ఆర్థిక జీవితాన్ని ప్రణాళిక బద్ధంగా ఉన్నతంగా తీర్చిదిద్దాలని అంబేద్కర్ వివరించాడు. ప్రతి పౌరునికి భీమా తప్పనిసరిగా చేసి వ్యాపారాన్ని జాతీయం చేయాలన్నాడు. పారిశ్రామిక అభివృద్ధికి ప్రభుత్వ సోషలిజం తప్పనిసరి అని సూచించాడు. లేకుంటే ఆర్థిక అసమానతలు సృష్టించబడతాయని చెప్పాడు. ఈయన సూచనలు సహజంగానే ఆనాటి జాతీయోద్యమానికి నాయకత్వం వహించిన బడా భూస్వామ్య వర్గాలకు రుచించలేదు. అంబేద్కర్ ఆలోచనలను తీసిపక్కన పెట్టారు. రాజ్యాంగం ప్రజల జీవితాలకి గ్యారంటీ ఇవ్వలేదని గ్రహించిన అంబేద్కర్ రాజ్యాంగ సభలో ఇలా మాట్లాడారు... "1950 జనవరి 26న మనం వైరుధ్యాలతో కూడిన జీవితం ప్రారంభిస్తాం. మనకు రాజకీయాలలో సమానత్వం, సామాజిక, ఆర్థిక జీవితంలో అసమానత్వం ఉంటాయి. రాజకీయాలలో మనిషికి ఒక ఓటు, ఓటుకు ఒకే విలువ ఉంటుంది. కానీ, సామాజిక ఆర్థిక జీవితంలో మనుషులందరికి ఒకే విలువ ఉండదు. ఎంతకాలమీ వైరుధ్యాల జీవితంలో మనుషులందరికి ఒకే విలువ ఉండదు. ఎంతకాలం వైరుధ్యాల జీవితం? ఈ వైరుధ్యాన్ని వీలైనంత త్వరగా అంతం చేయాలి. లేకుంటే ఈ సభావారు కష్టపడి నిర్మించిన ఈ వ్యవస్థలను అసమానతలకు గురైన ప్రజలు ఎగరకొట్టేస్తారు" అంటాడు.

దారిద్ర్య నిర్మూలనకు మౌలికమైన వ్యవసాయ సంస్కరణలు అమలు కాలేదు. గ్రామీణ పేదరికాన్ని తొలగించి గ్రామసీమల్లో అణచివేతకు, వివక్షకు గురవుతున్న నిమ్నజాతుల ప్రజలకు దక్కాల్సిన భూమి వారికి దక్కలేదు. భూసంస్కరణలు అమలుకాలేదు. 75సంవత్సరాల స్వాతంత్ర్య ఫలాలు ఎవరికి దక్కాయి? ఎంతో గర్వంగా చెప్పుకొంటున్న ప్రాజెక్టులు, అభివృద్ధి, ప్రణాళికలు ఎవరికి ప్రయోజనం కలిగించాయి? గ్రామ, పట్టణ ప్రాంతాల్లో లభించే మేలైన భూమి ఎవరు ఆక్రమించారు? చట్టసభ, కార్యనిర్వాహక, న్యాయ విభాగాలు, మరికొన్ని కీలక విభాగాల్లో ఎవరు స్థిరపడిపోయారు? కాబట్టి 75 ఏండ్ల నాడు వచ్చిన స్వాతంత్ర్యం నిమ్నజాతులది కాదని తేలిపోయింది. అంబేద్కర్ ఊహలు కలలుగానే తేలిపో యాయి. అలాగే రాజ్యాంగంలో రిజర్వేషన్ల పొందుపరచిన అంబేద్కర్ ఒక సందర్భంలో... "నేను ఏర్పరచిన రిజర్వేషన్లతో ఆర్థిక, సామాజిక సమానత్వం వస్తుందను కున్నా, అయితే వాటివల్ల గుప్పెడుమంది గుమస్తాలు మాత్రమే తయారయ్యారు. కానీ మెజారిటీ ప్రజానీకం నేటికీ గ్రామాల్లో భూమిలేకుండా భూస్వాములకు కానీ మెజారిటీ ప్రజానీకం నేటికి గ్రామాల్లో భూమిలేకుండా భూస్వాములకు దాస్యం చేస్తున్నారు. వారి కోసం నేను ఏమీచేయలేకపోయాను" అంటూ ఆవేదన చెందారు అంటే భూపంపిణీ జరగకుండా ఈ దేశంలో ఆర్థిక సామాజిక సమానత్వం జరగదు. వ్యవసాయాధారిత మనదేశంలో భూమికి, సామాజిక న్యాయానికి ఉన్న సంబంధం ఇదే. భూపంపిణీ జరగకుండా సామాజిక న్యాయం సాధ్యం కాదు, కాబోదు. సామాజిక న్యాయానికి, భూమికి ఎంతో అవినాభావ సంబంధ ం ఉన్నది. ఎందుకంటే మానవ జాతికి సమస్త జీవాధారమైనది భూమి కాబట్టి అనాదిగా భూమిని ఆక్రమించుకోవటం, దోచుకోవటం జరుగుతూ వస్తోంది. ఆ భూమి మీద బతుకుతున్న మనుషుల్ని, సమస్త జీవజాలాన్నీ, మొత్తం సంపదను ఆక్రమించుకొని రాజ్యాలు ఏర్పడ్డాయి. రాజులు ఏర్పడ్డారు. యుద్ధాలు జరిగాయి. ఇలా చరిత్రంతా మానవాళి నెత్తుటితో తడిసి ముద్దయ్యింది. చివరికి మట్టిబిడ్డలయిన నిమ్నజాతి భూమి పుత్రులకి భూమి దక్కకుండా చేశారు.

ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ప్రజలకు దక్కాల్సిన భూములు గుంజుకొని దేశ, విదేశీ బహుళజాతి కంపెనీలకు, బడా బాబులకు కట్టబెడుతున్నాయి. వీరు భూమి సంబంధాలన్నీ మార్కెట్ సంబంధాలుగా మార్చారు. నేడు ప్రపంచంలో చర్చంతా భూమిపైనే. రియల్ ఎస్టేట్‌గా పేరుతో సాగుతున్న భూవ్యాపారం ఇవాళ ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఆక్సిజన్‌గా మారింది. భూమి అంటే నేల మాత్రమే కాదు, ఆనేలలోని వనరులు, ఈ మట్టిలో నుంచి శ్రమజీవులు పుట్టించిన సమస్త జ్ఞానం, సమిష్టి జీవనం, కళలు, సంస్కృతి గల భూమి నిమ్న జాతులకు దక్కాలి. ఇదే ఏకైక పరిష్కారం. ఇది జరగాలంటే అణగారిన వర్గాల ప్రజలు ఏకమై ఉద్యమించాలి. బానీస్, క్యూబాతరహా సోషలిజంను ఈ దేశంలో స్థాపించుకోవాలి.

నవభారత వికాస దార్శనికుడు..



-అంకం నరేష్,
6301650799



నవ భారత వికాసానికి బాటలు వేసిన దార్శనికుడు, సర్వ సమానత్వానికి కృషిచేసిన కారణజన్ముడు బాబాసాహెబ్ అంబేద్కర్. పునాదుల నుంచి దేశాన్ని పెకిలిస్తున్న సమస్త చెడులకు కుల వివక్ష మూలమని కుండబద్దలు కొట్టి అసమానతలు లేని స్వేచ్ఛ భారతావని కోసం అహర్నిశలు శ్రమించిన మహనీయుడు అంబేద్కర్. స్వతంత్ర్య సంగ్రామ నాయకులుగా ముందువరుసలో నిలిచేది కొందరైతే స్వతంత్ర భారత నిర్మాతగా అంబేద్కర్ ది సమున్నత పీఠం. స్వేచ్ఛ సమానత్వం సౌభ్రాతృత్వం మూలస్తంభాలుగా రాజ్యాంగ మహసౌదా నమూనాను ఆవిష్కరించిన రాజ్యాంగ నిర్మాత,దేశ సమస్యల పట్ల ఖచ్చితమైన దృక్పథంతో ఆచరణాత్మక పరిష్కారాలతో జాతి నడవడికి కొత్త రక్తం ఎక్కించిన మార్గదర్శి బాబాసాహెబ్ అంబేద్కర్ యాదిలో ఒక్కసారి స్మరించుకుందాం..

కుల వివక్షను ఎదుర్కొంటూ..

భారత రాజ్యాంగ నిర్మాత, ప్రజాస్వామ్య పరిరక్షకుడు, సంఘసంస్కర్త అయిన బాబాసాహెబ్ అంబేద్కర్ గారు మహారాష్ట్రలోని రత్నగిరి జిల్లాలో మందన్ గాడ్ పట్టణానికి దగ్గరున్న అంబావాడే గ్రామంలో రాంజి సక్ పాల్, భీమాబాయి పుణ్య దంపతులకు జన్మించారు. అణగారిన మహర్ వర్గంలో జన్మించి జీవితంలోని ప్రతి దశలోనూ కులపరమైన వివక్ష అనుభవించి అవమానాలు ఎదుర్కొన్న అంబేద్కర్ విదేశీ పాలకుల పైన కన్నా అంతర్గతంగా దేశంలో కొనసాగుతున్న కుల వివక్ష పైన పోరాటం చేశారు. అందరితో పాటు ఎద్దుల బండి ఎక్కడానికి, తరగతి గదులు కూర్చోవడానికి, బావిలో నీళ్ల తోడడానికి, గుడికి వెళ్లడానికి కులాన్ని అడ్డుగా చూపుతున్న అగ్రవర్ణాల ఆధిపత్యానికి తెరదించాలని బాల్యదశ నుండే కంకణం కట్టుకున్నాడు. అనేక అవమానాలు ఎదుర్కొంటూ బరోడా మహారాజు శాయాజీరావు గైక్వాడ్ ఇచ్చిన 25 రూపాయల వేతనంతో బి.ఏ డిగ్రీ పూర్తి చేసి 1913లో పై చదువులకు కొలంబియా వెళ్ళాడు. 1915 లో ఎమ్.ఏ,1916 లో పిహెచ్ డి పట్టాను పొందాడు. 1917 లో ఇండియాకి తిరిగి వచ్చిన తర్వాత కుల వివక్ష పై అలుపులేని పోరాటం కొనసాగించాడు. 1927లో మహదలో దళిత మహాసభ నిర్వహించి నూతన సామాజిక ఉద్యమ వికాసానికి శ్రీకారం చుట్టాడు. బడుగుల తరవున అంబేద్కర్ బలమైన వినిపించడంతో 1932లో బ్రిటిష్ ప్రధాని రామ్సే మెక్ డోనాల్డ్ కమ్యూనల్ అవార్డు ప్రకటించారు. దాని ప్రకారం అగ్రవర్ణ, నిమ్న, దళిత ,ముస్లిం, సిక్కు, భారతీయ క్రిస్టియన్లు, ఆంగ్లో-ఇండియన్ లకు రాజకీయ ప్రాతినిధ్యం కోసం ప్రత్యేక నియోజకవర్గాలు కేటాయించారు. అణగారిన వర్గాలకు రాజ్యాధికారంలో వాటా కల్పించిన మొట్టమొదటి ఘట్టం అది. కొంతకాలం క్రితం వరకు తన బతుకుల మీద అజమాయిషీ లేని వర్గాలు ఇప్పుడు దేశాన్ని పరిపాలించేందుకు ముందుకు వస్తున్నాయి అంటే అది అంబేద్కర్ దార్శనిక ఫలితమే. ప్రభుత్వ ఉద్యోగుల్లో దళిత, బహుజనుల రిజర్వేషన్లకు రాజ్యాంగ భద్రత కల్పిస్తూ అంబేద్కర్ తీసుకున్న నిర్ణయం కుల వివక్షను సంపూర్ణంగా రూపుమాపే వ్యవస్థ నిర్మాణంలో తొలి అడుగు అని చెప్పవచ్చు.

రాజ్యాంగ నిర్మాతగా..

రాజ్యాంగ ముసాయిదా సంఘంలోని ఏడుగురు సభ్యుల్లో ఒకరు చనిపోయారు. మరొకరు అమెరికా వెళ్లిపోయారు. ఇంకొకరు రాష్ట్ర వ్యవహారాల్లో ఎడతెరిపి లేకుండా ఉన్నారు. మరో ఇరువురు సభ్యులు ఆరోగ్య కారణాల రీత్యా ఢిల్లీకి దూరంగా ఉన్నారు. ఇక మిగిలింది ముసాయిదా సంఘం అధ్యక్షుడు అంబేద్కర్ మాత్రమే. రాజ్యాంగ రచన భారమంతా పూర్తిగా ఒక్కరే మోసి అంత ఒత్తిడిలోను అద్భుతమైన రాజ్యాంగాన్ని రూపొందించారు. రెండు సంవత్సరాల 11 నెలల 18 రోజులు కష్టపడి ఎంతో పెద్ద రాజ్యాంగం నిర్మించిన అంబేద్కర్ గారు దేశాన్ని పదికాలాలపాటు నిలబెట్టే కీలక అంశాలను రాజ్యాంగంలో పొందుపరిచారు. మూడవ భాగంలో ప్రాథమిక హక్కులను నాలుగో భాగంలో ఆదేశిక సూత్రాలను పొందుపరిచి నూతన హక్కులకు ఆదర్శాలకు తెరతీశారు. మతానికో రకమైన ధర్మ సూత్రాలున్న మన దేశంలో అవే ప్రాతిపదికగా సాగితే జాతి ప్రగతి రథం కుదుపులకు లోనుకావడం ఖాయమని భావించిన బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగంలోని 44 అధికరణంలో ఉమ్మడి పౌర స్మృతి చోటుకల్పించారు. రాజ్యాంగ నిర్మాతగా మారి సామాజిక సమానత్వం కోసం ప్రయత్నించారు. "రాజ్యాంగం ఎంత మంచిదైనా కావచ్చు దానిని అమలు పరిచే వారు చెడ్డవారైతే అది చెడు అవుతుంది. మంచివారు అయితే అది మంచిదవుతుంది" రాజ్యాంగంలో రూపుదిద్దుకున్న నిబంధనల కన్నా పాలకుల స్వీయ నైతికత దేశ భవిష్యత్తును నిర్ణయిస్తుందని అన్నారు. రాజకీయ ఆర్థిక సామాజిక రంగాల్లో ఎదగడానికి అందరికీ సమాన అవకాశాలు ఉండాలన్న ఆశయంతో రిజర్వేషన్ విధానాన్ని శ్రీకారం చుట్టిన అంబేద్కర్ కలలుగన్న సామాజిక సమానత్వం, కుల రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరం పాటుపాడడమే ఆయనకు మనం అర్పించే నిజమైన నివాళి.

మనువాదంపై మహోద్యమమే అంబేద్కర్‌కు నివాళి



ఈ ఏడాది కూడా ఏప్రిల్ 14 రానే వచ్చింది. మహనీయుడు అంబేద్కర్ పుట్టిన రోజున జై భీమ్ అని నినదించడం, డీజేలతో ఊరేగింపులు చేయడం, నీలి తోరణాలు కట్టడం అంబేద్కర్ విగ్రహాలకు దండలు వేయటం అనే తంతు ఈ ఏడాది కూడా జరుగుతుంది. ఏప్రిల్ 14 డిసెంబర్ 6న ఆయన జయంతి వర్ధంతిల సందర్భంగా మాత్రమే అంబేద్కర్ ఆశయాలని స్మరించుకొని మిగిలిన 363 రోజులు ఆయన ఆశయాలకు భిన్నమైన కార్యాచరణలో నిమగ్నం కావడం కూడా ఒక తంతుగా మారుతోంది. ఈ సందర్భంగానైనా అసలు అంబేద్కర్ ఏం చెప్పారు? మన పాలకులు ఏం ఆచరిస్తున్నారు? అంబేద్కర్ ఆశయాన్ని సాధించే వారసులెవరు? వారు ఏం చేయాలి? ఇప్పుడు అందరం నెమరువేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అంబేద్కర్ అనగానే కేవలం రాజ్యాంగం రాశాడు. రిజర్వేషన్లు ఇచ్చాడు. కాబట్టి ఆయన దళితుల దేవుడని ఆయన పట్ల భక్తి చాటుకోవడానికి చాలా మంది పోటీపడుతున్నారు. అంబేద్కర్ ఆశయ పరమవిరోధిగా ఉన్న ఆర్ఎస్ఎస్ బీజేపీ కూడా పూలదండలు వేసి కొబ్బరికాయలు కొట్టడం, తిలకం దిద్దడం వంటి వాటితో సామాజిక సమరస్వత వేదిక అంబేద్కర్ హిందూ పరిషత్, దళిత హిందూ పరిషత్, దళిత మోర్చా పేరుతో ఆర్ఎస్ఎస్, బీజేపీలు కొనియాడుతున్నాయి. అంబేద్కర్ తన తుదిశ్వాస వరకు ఏ మనువాద అంతం కోసం కృషి చేశారో ఆయన ఆశయాలకు పరమ విరోధిగా ఉన్న మనువాద శక్తులు కూడా అంబేద్కర్‌ను కొనియాడడం అంటే అంబేద్కర్‌ను హైజాక్ చేయడమే.

అమెరికా కొలంబియా విశ్వవిద్యాలయం ఎదుట 300 అడుగుల స్థలంలో అంబేద్కర్ విగ్రహాన్ని నెలకొల్పారు. రష్యా దేశ అధ్యక్షుడు పుతిన్ తన ఛాంబర్‌లో అంబేద్కర్ చిత్రపటాన్ని పెట్టాడు. ఐక్యరాజ్యసమితిలో ప్రతి ఏటా అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. అంబేద్కర్ పుట్టిన రోజున ప్రపంచ విజ్ఞాన దినోత్సవంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా అంబేద్కర్‌కు కీర్తి ప్రతిష్టలు పెరుగుతుంటే మనదేశంలో మాత్రం అంబేద్కర్ అంటే అంటరానివాడిగా నడి ఊర్లో కూడా ఆయన విగ్రహం కూడా ఉండటానికి వీలు లేదు అంటే ఆయనను ఎంతగా అవమానిస్తున్నారో గమనించవచ్చు. అంబేద్కర్ మాటల్లో నేను రాసిన రాజ్యాంగం కేవలం ఓటు హక్కు మాత్రమే ఇచ్చి, రాజకీయ స్వాతంత్ర్యాన్ని కల్పించాను కానీ ఆర్థిక సామాజిక స్వాతంత్ర్యాలను దేశంలో అణచివేతకు పీడనకు గురవుతున్న పేదలు పోరాడి సాధించుకోవాలన్నారు. ఆస్తి జాతీయం కాకుండా ఆర్థికంతరాలు తొలగిపోకుండా కుల నిర్మూలన జరగకుండా సామాజిక అణిచివేత అంతం కాదన్నారు. మనుస్మృతి అనే అధర్మశాస్త్రం వేల సంవత్సరాలుగా మెజారిటీ ప్రజలుగా ఉన్న శూద్రులకు చదువు సంపద ఆస్తులు, ఆభరణాలు, అధికారాలు అన్నింటిని దూరం చేసి మెజారిటీ మతమని చెప్పుకునే హిందూమతంలో మైనార్టీ ప్రజలకే మేలు చేసి, మెజారిటీ హిందువులకి తీరని ద్రోహం చేసిందంటాడు అంబేద్కర్. సమాజంలో సగభాగం ఉన్న మహిళా సమానత్వం సాధించకుండా దేశం సమాన అభివృద్ధి సాధించలేదన్నారు. అందుకే మహిళా సమానత్వం కోసం నాడు పార్లమెంటులో హిందూ కోడ్ బిల్లు ప్రవేశపెట్టి దానిని నాటి కాంగ్రెస్ ప్రభుత్వం అంగీకరించనందుకు కేంద్ర న్యాయశాఖ మంత్రి పదవికి రాజీనామా చేసి బయటకు వచ్చారు.

బ్రాహ్మణిజం, క్యాపిటలిజం భారత దేశ ప్రజలకు శత్రువులని ప్రకటించారు. నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సర్కార్ రెండు తలలో విషం నింపుకున్న విషసర్పం. అది బ్రాహ్మణిజాన్ని క్యాప్టలిజాన్ని పెంచిపోషిస్తున్నది. స్వాతంత్ర్యోద్యమంతో ఏ మాత్రం సంబంధంలేని, జాతీయ జెండాను వ్యతిరేకించి అంబేద్కర్ రాసిన భారతదేశ రాజ్యాంగం ఈ దేశానికి పనికిరాదని ప్రకటించిన ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లోని బీజేపీ నేడు దేశ భక్తి జాతీయవాదం అంటూ ఫోజు పెడుతుంది. రాజ్యాంగంపై ప్రమాణం చేసి గద్దెనెక్కిన బీజేపీ మోడీ సర్కార్ ఆ రాజ్యాంగాన్ని పూర్తిగా రద్దు చేయడానికి కుట్రలు చేస్తుంది. అందుకోసమే ఫిబ్రవరి 15న హైదరాబాద్ తెలుగు యూనివర్సిటీలో మనుస్మృతి మనదేశ ప్రాచీన రాజ్యాంగం అంటూ దానిని ఆవిష్కరించడానికి ప్రయత్నించారు. నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ 'మాకు పార్లమెంట్‌లో సంఖ్యాబలం ఉంది. సెక్యులరిజం అనే పదం మాకు నచ్చదు కచ్చితంగా రాజ్యాంగాన్ని మారుస్తాం' అంటూ అనుచిత వ్యాఖ్యలు చేశాడు. రాజ్యాంగంపై ప్రమాణం చేసిన ఆయన ఆ రాజ్యాంగం ఎన్నికైన పార్లమెంట్ సభ్యుడిగా ఎలా కొనసాగుతాడు. గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ రాజ్యాంగం కేవలం కాగితం మాత్రమేదానిని ఎప్పుడైనా చింపేస్తాం అది మాకు ముఖ్యం కాదు. హిందూ ధర్మమే మాకు ముఖ్యం అని వ్యాఖ్యానించారు. ఆయన వ్యాఖ్యలు వారి ఆర్ఎస్ఎస్ బీజేపీ విధానమని నేటి తరం గ్రహించాలి. లాభాలు వచ్చే పాడిఆవు లాంటి ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా బడా కార్పొరేట్ శక్తులకి అమ్ముతున్నారు. ఇప్పటికే 16 కీలక ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేసింది. ప్రభుత్వ రంగం మొత్తం ప్రయివేటుపరం చేయడం ద్వారా దళిత గిరిజన బలహీన వర్గాలకు అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా కల్పించిన రిజర్వేషన్లకు గండి కొడుతున్నది.



టి. స్కైలాబ్ బాబు

దళిత గిరిజన జనాభా దామాషా ప్రకారం రావలసిన నిధులు రాకుండా ఎస్సీ, ఎస్టీ, సబ్‌ప్లాన్ చట్టాన్ని నీటి అయోగ్ పేరిట నిర్వీర్యం చేస్తున్నది. దళితుల పేదల కీలక ఉపాధి వనరుగా ఉన్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడుస్తున్నది. దేశంలో 80 కోట్ల మంది రెక్కల కష్టంపై జీవించే పేదల ఉపాధి కోసం బడ్జెట్‌లో కేవలం 60వేల కోట్ల రూపాయలు కేటాయించి బడా పెట్టుబడిదారీ దారులకు మాత్రం రూ.10లక్షల కోట్ల రాయితీలు ఇచ్చింది. అందుకే బీజేపీ ప్రభుత్వం కోటీశ్వర్లకు కొమ్ముకాస్తూ పేదలకు ద్రోహం చేస్తున్నదని గ్రహించనంత కాలం మనం మోసపోతూనే ఉంటాం.

అంబేద్కర్ విద్యా వైద్యం ఎల్లవేళలా ప్రభుత్వ సంక్షేమ రంగంలో మాత్రమే ఉండాలి ప్రయివేటు పరం కావొద్దు అన్నారు. కానీ కేంద్ర బీజేపీ సర్కారు నూతన విద్యా విధానం ముసుగు ధరించి పక్కా మనువాద విద్యా విధానాన్ని తెచ్చింది. అణగారిన పేదలకు ఉన్నత విద్యను దూరం చేస్తుంది. గో రక్షక దళాల మాటున దేశంలో దళితులు మైనార్టీలపై కిరాతక దాడులు చేస్తుంది. దబోల్కర్ ఫన్సారే కల్బుర్గి, గౌరీ లంకేష్ వంటి మేధావులను కిరాతకంగా హత్యగావించింది. బీజేపీ పాలిత రాష్ట్రాలలో దళితులపై 300 రెట్లు హింస పెట్రేగిపోయింది. దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బీసీ కులానికి చెందిన వాడని బీజేపీ చెప్పుకుంటుంది. కానీ దేశంలో బీసీల కులగణన చేపట్టకుండా బీసీలకు ద్రోహం చేస్తుంది. కేంద్రంలో సుమారు 10 లక్షల పోస్టులు ఖాళీగా ఉంటే అందులో 2.50 లక్షల పోస్టులు దళిత గిరిజనులవి ఖాళీగా ఉన్నాయని ఏడవ వేతన సంఘం పేర్కొన్నది. వాటిని భర్తీ చేయడం లేదు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న మాట ఏమైందని నిరుద్యోగులు నిలదీస్తున్న పెడచెవిన పెడుతున్నది.


మన రాజ్యాంగ మూల స్తంభాలైన ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, ఫెడరలిజం, సామాజిక న్యాయం వంటి వాటిపై బీజేపీ ముప్పెటదాడి చేస్తుంది. ప్రశ్నించే గొంతులపై అనేక ఫాసిస్టు చట్టాలను ప్రయోగిస్తుంది. ఉపా వంటి నల్ల చట్టాలను తీసుకొచ్చి తమను ప్రశ్నించిన వారిపైకక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుంది. మహనీయుడు అంబేద్కర్‌ల ఆశయాల సాధన కోసం కృషి చేయడం అంటే వారి జయంతులు వర్ధంతుల్లో దండలు వేసి దండాలు పెట్టి సంబరపడటం మాత్రమే కాదు మతసామరస్యం, దేశ సమైక్యత సమగ్రతల కోసం కృషి చేయాలి.

భారతమాత అంటే పేపర్‌పై గీసిన బొమ్మ కాదు, భారతీయ మహిళలందరూ భారతమాతలే అనే ఒక విజ్ఞతను చాటాలి. దేశంలోని అమ్మలను ద్వేషించిన పర్వాలేదు కానీ, ఆవులను ప్రేమించాలి అనే నీచ సంస్కృతి పెరుగుతుంది. దీనిని పౌరసమాజం ప్రశ్నించాలి. పురుషులతో మహిళలు సమానమని చాటడం ద్వారా చట్టసభల్లో మహిళలకు సమాన ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా మన మానవీయతను చాటుకోవాలి. దేశభక్తి అంటే ప్రభుత్వ రంగాన్ని పరిరక్షించడమే కానీ కార్పొరేట్ శక్తులకు కట్టపెట్టడం కాదు. దేశంలో కులమత విచ్చిన్నాలను రెచ్చగొట్టడం చిచ్చులు పెట్టడడం ఉద్రిక్తతలు విద్వేషాలను రగల్చడం కాదు, దేశ సమైక్యత సమగ్రతల కోసం కృషి చేయడం. అంబేద్కర్ ఆశయాల అమలుకు మన ముందు ముఖ్యంగా నేడు రెండు కర్తవ్యాలు ఉన్నాయి. రాజ్యాంగాన్ని రక్షించుకోవడం, మనువాదాన్ని మట్టిలో పాతిపెట్టడమని గుర్తించాలి. అంబేద్కర్ విగ్రహాలకు దండలు వేస్తూ ఆయన ఆశయాలను సమాధి చేస్తున్న పాలకుల కపట స్వభావాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలి. ఓవైపు సరళీకరణ విధానాలు మరోవైపు మనువాద విధానాలతో దేశాన్ని అన్ని రంగాల్లో సంక్షోభంలోకి నడిపిస్తున్న మనువాద బీజేపీ విధానాలపై మహోద్యమం చేపట్టాలి. ఆయన చూపిన సామాజిక న్యాయం దేశంలో అమలు జరగాలంటే భూమి సంపద ఉత్పత్తి వనరులు బడ్జెట్ ప్రకృతి వనరులలో పీడిత వర్గం పట్టు సాధించాలి. యువతరం మనసుపెట్టి ఆలోచించి అంబేద్కర్ అడుగుజాడల్లో పయనించాలి.

మార్చి 28న అర్ధరాత్రి మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండలం వింజమూర్ గ్రామంలో ప్రారంభానికి సిద్ధమై ముసుగు వేయబడి ఉన్న అంబేద్కర్ విగ్రహానికి అదే గ్రామానికి చెందిన ఆర్ఎస్ఎస్ కార్యకర్త నిప్పు పెట్టాడు. ఎందుకు ఆర్ఎస్ఎస్ కార్యకర్తకు అంబేద్కర్‌పై అంత కోపం వచ్చింది. ఆ గ్రామంలో శివాజీ విగ్రహం, గుడి, పక్కన గ్రామ సచివాలయం ఉన్నాయి. మధ్యలో వివేకానందుడి విగ్రహం నెలకొల్పుతాము. నడి ఊర్లో అంబేద్కర్ విగ్రహం ఎందుకు అది మీ ఎస్సీ కాలనిలో పెట్టుకోండి అని ఆగ్రహంతో నిప్పు పెట్టాడు. ఇది ఒక ఆర్ఎస్ఎస్ కార్యకర్త తెలియక చేసిన పని కాదు. ఆర్ఎస్ఎస్‌కు అంబేద్కర్ పట్ల ఉన్న ఆలోచనలకు నిదర్శనమే ఈ దుశ్చర్యగా భావించాలి.

మన రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహాన్ని నెలకొల్పడం, నూతన సచివాలయానికి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పేరు పెట్టడడం సంతోషమే. కానీ రాష్ట్రంలో బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పటికీ దళితులపై దాడులకు పాల్పడుతుంది ఆర్ఎస్ఎస్ బీజేపీ శ్రేణులే.. రామోజీపేట అల్మాస్ పూర్, గువ్వలేగి, కనిపెట్ట, పొట్టిపల్లి సింగాయపల్లి వంటి గ్రామాలలో ఆర్ఎస్ఎస్ బీజేపీ గుండాలు దళితులపై దాడులకు పాల్పడ్డారు. ఈ దాడులను అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమవుతుంది.

రాష్ట్రంలో 76కుల దురహంకార హత్యలు జరిగాయి. వీడీసీల పేరిట సాంఘిక బహిష్కరణలు జోగిని వ్యవస్థ నేటికీ కులవక్ష అంటరానితనం దళితులపై దాడులు దౌర్జన్యాలు రెట్టింపు స్థాయిలో పెరుగుతున్నాయి. వీటిని అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ నేపథ్యంలో కెవిపిఎస్ రాష్ట్ర వ్యాప్తంగా రాజ్యాంగాన్ని రక్షించుకుందాం. మనువాదాన్ని మట్టు పెడదాం. రిజర్వేషన్లు బీసీ కులగణన సామాజిక న్యాయం కోసం ఏప్రిల్ 15 నుండి 30 వరకు పూలే అంబేద్కర్ జన జాతరలు నిర్వహిస్తున్నది. మనువాద బీజేపీకి హటావో దేశ్ కే బచావో అనే నినాదంతో ముందుకు సాగుతున్నది. భారతీయులుగా మతోన్మాద, మనువాద శక్తులను ఓడించడానికి ఐక్యం కావడం ద్వారా మనువాదంపై మహోద్యమం చేపట్టడం ద్వారా అంబేద్కర్‌కి మన ఘన నివాళు లర్పిద్దాం.



మరువలేము... బాబా సాహెబ్

ముడ్డికి చీపిరితో బతికిన మాకు
ముందుచూపువై మార్గం చూపి
అనామకుల నుంచి ఆలోచించే స్థాయికి మార్చి
సదువుతో జీవిత సత్యం నేర్పి
నిన్నేలా మరువగలం..మహనీయుడా..

అంటరానిపై ఆగ్రహంతో.. ఎదిరించి నిలబడితివి
నీ ధైర్యం, నీ తెగువ,
మా కళ్లు తెరిపించిన ధీరుడివైతివి..
రాజ్యాంగంతో మా హక్కులు చెప్పి
రాజ్యాధికారం మన స్వప్నమంటివి.
నిమ్న వర్గాల నాయకుడివై.. నిత్యం కొలిచినాం
అందుకే నీవు మా దేవుడివయ్యా..

చీకటి బతుకుల్లో వెలుతురు తెచ్చిన
నీ పుట్టిన రోజే మాకు పండగనయ్యా..
మరువలేము మా అంబేద్కరా..
జోహార్లు మా అంబేద్కరా..
జోహార్లు మా బాబా సాహెబ్...



రచన
దళితరత్న అవార్డు గ్రహీత
లింబూరి లక్ష్మణ్,
ఆర్టిస్ట్, జర్నలిస్టు - బోధన్. నిజామాబాద్

వ్యక్తి కాదు.. వ్యవస్థ



అంబేద్కర్ అంటే ఒక వ్యక్తి కాదు వ్యవస్థ
అంబేద్కర్ అంటే ఒక యుగపురుషుడు
అంబేద్కర్ అంటే ఆదర్శనీయుడు
అంబేద్కర్ అంటే మార్గదర్శి
అంబేద్కర్ అంటే మొక్కవోని ఉక్కు సంకల్పం
అంబేద్కర్ అంటే స్ఫూర్తి
అంబేద్కర్ అంటే రగిలే నిప్పుకణం
అంబేద్కర్ అంటే సాహసం
అంబేద్కర్ అంటే తలవంచని వ్యక్తిత్వం
అంబేద్కర్ అంటే నీతి, నిజాయితీ
అంబేద్కర్ అంటే భారతీయుడి గుండెచప్పుడు
అంబేద్కర్ అంటే ఆదర్శం
అంబేద్కర్ అంటే ఒక విశ్వవిద్యాలయం
అంబేద్కర్ అంటే పేద, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి
అంబేద్కర్ అంటే ఒక మేధావి
అంబేద్కర్ అంటే భారతరత్నం
అంబేద్కర్ అంటే ఒక నాయకుడు
అంబేద్కర్ అంటే ఒక శాస్త్రవేత్త
అంబేద్కర్ అంటే ఒక విద్యా వేత్త
అంబేద్కర్ అంటే అందరివాడు
అంబేద్కర్ అంటే వివక్షతకు
ఎదురొడ్డి నిలిచిన జ్వాల
అంబేద్కర్ అంటే రెపరెపలాడే త్రివర్ణ పతాకం

అంబేద్కర్ ఆశయాలు, సిద్ధాంతాలు, లక్ష్యాలు అమలు చేయడమే అసలైన నివాళి..
అంబేద్కర్ రచనలు చదవడం, చదివించడం అక్షర నివాళి.

- డాక్టర్. ఎస్. విజయ భాస్కర్.,
అధ్యక్షులు.,హైదరాబాద్ ఓల్డ్ సిటీ రైటర్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ (హొకా)
హైదరాబాద్-59. 9290826988

దళితబంధుతో ఆర్థికాభివృద్ధిలో దళితులు


దయానంద్

- ఎస్సీ కార్పొరేషన్ ఈడీ టి. దయానంద్

నవతెలంగాణ-కామారెడ్డి

దళితుల ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తేనే సమానత్వం సాధిస్తారని అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా సీఎం కేసీఆర్ అత్యంత ప్రతిష్టాత్మకంగా దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ పథకం కింద మొదటి విడుతలో ఎంపికైన లబ్దిదారులకు యూనిట్లు పంపిణీ పూర్తయింది. ఈ పథకం కింద యూనిట్లు పొందిన దళిత కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాయి.

అంబేద్కర్ అందరివాడని, సమానత్వం కోసం ఆయన చేసిన కృషి ఎనలేది. ఆయన రాసిన రాజ్యాంగం వల్లే మన రాష్ట్రం ఏర్పాటు అయింది. సామాన్యులకు కూడ ఉద్యోగం, విద్య వంటివి ఆయన రాసిన రాజ్యాంగం వలనే సాధ్యమైంది. ఆయనను ఆదర్శంగా తీసుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం కెసిఆర్ ప్రమచంలోనే ఎక్కడ లేని విదంగా దళిత బంధు పథకాన్ని ప్రవేశపెట్టారు. దళిత బందు పథకంతో ఎంతో మంది దళితులు పారిశ్రామిక రంగంలో ఎదుగుతున్నారు. దళిత బందు పథకంలో డెయిరీ ఫాం, సెంట్రింగ్, టెంట్‌హౌజ్, గేదెలు, ట్రాక్టర్‌లు, జేసీబీలు వంటి యూనిట్లతో ఆర్థికంగా అభివృద్ధి చెందారు.

అంబేద్కర్ ఆలోచనలను, ఆశయాలను ఆదర్శంగా తీసుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి కేసిఆర్ వాటిని అమలుపరుచడం చాలా గర్వ కారణం. దేశంలోనే ఇప్పటి వరకు ఏ సీఎం చేయలేని విధంగా 125 అడుగులతో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి నేడు విగ్రహ ఆవిష్కరణ చేయడం అభినందనీ యం. సచివాలయం పేరును కూడ డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌గా నామకరణం చేయడం అంబేద్కర్‌కు ఇస్తున్న సముచిత గౌరవం.





అణగారిన వర్గాల ఆశాజ్యోతి.. అంబేద్కర్

- మోపాల్ సర్పంచ్ క్యాతం రవి



నవతెలంగాణ-మోపాల్

అణగారిన వర్గాల ఆశాజ్యోతి.. బాబాసాహేబ్ అంబేద్కర్ అని మోపాల్ సర్పంచ్ క్యాతం రవి కొనియాడారు. శుక్రవారం అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని నవతెలంగాణతో మాట్లాడారు. మోపాల్ కొత్త మండలంగా ఏర్పాటైనప్పటి నుంచి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషితో గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. అలాగే అభివృద్ధికి రూరల్ ఎమ్మెల్యే, ఆర్టీసీ చైర్మెన్ బాజిరెడ్డి గోవర్ధన్ తమకు పూర్తి సహకారం అందిస్తున్నారని తెలిపారు. తాను సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టాక.. నూతన సీసీరోడ్లు, డ్రయినేజీల నిర్మాణం చేపట్టానని తెలిపారు. అలాగే నూతన గ్రామపంచాయతీ భవనం నిర్మాణం పూర్తి చేశామని, త్వరలోనే ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రారంభిస్తామని వివరించారు.









బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించిన సర్పంచ్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి
మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో స్టేట్ రూరల్ డెవలప్మెంట్ కింద రూ.20లక్షల నిధులతో వెంకటాపూర్ నుంచి వెల్లుట్ల రోడ్డుకు బ్రిడ్జి నిర్మాణ పనులను సర్పంచ్ సురేఖ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ స్థానిక కాంట్రాక్టర్‌కు పనులలో నాణ్యత లోపం లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాధవి బాలరాజ్ గౌడ్, ఎంపీటీసీ సుతారి లక్ష్మి సాయిలు, సొసైటీ చైర్మన్ పటేల్ సాయిలు, ఉప సర్పంచ్ శివ, దామోదర్, మల్లేష్, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు అయ్యల సాయిలు, నిజ్జన పోచయ్య, సంగోజీపేట లక్ష్మణ్, రాములు, మంద్రు నారాయణ, రాములు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై ధాన్యం ఆరబెడితే తగు జాగ్రత్తలు తీసుకోవాలి

- ఎస్ఐ అనిల్

నవతెలంగాణ-రామారెడ్డి
యాసంగి వరి కోతలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులు రోడ్లపై వరి ధాన్యాన్ని ఆరబెట్టేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ అనిల్ గురువారం ఒక ప్రకటనలో సూచించారు. రోడ్డుపై ధాన్యం ఆరబెట్టవద్దని, ఒకవేళ ఆరబెడితే 1/4 రోడ్‌లో మాత్రమే ఆరబెట్టాలని, ధాన్యం కుప్పలపై నల్ల పత్రాలను కప్పవద్దని, కుప్పలపై రాళ్లు పెట్టవద్దని సూచించారు. ధాన్యం ఆరబెట్టే ప్రదేశాన్ని వాహనదారులు గుర్తుపట్టేలా ఎర్రని బట్టతో సూచికను ఏర్పాటు చేయాలని, రోడ్డు మూలమలుపు వద్ద ఆరబెట్టవద్దని, ధాన్యం ఆరబెట్టిన ప్రదేశంలో రోడ్డు ప్రమాదం జరిగితే రైతు బాధ్యత వహించాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సూచించారు.

నాడి శ్వాస పనిచేయలేని స్థితిలో.. సీపీఆర్ ప్రక్రియను ప్రారంభించాలి


సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

నవతెలంగాణ-రెంజల్
ఎవరైనా మన కండ్ల ముందు అపస్మారక స్థితిలో పడిపోయి ఉంటే సీపీఆర్ ప్రక్రియను ప్రారంభించి వారి ప్రాణాలను కాపాడాలని డాక్టర్ ప్రణయ్ కుమార్, వినయ్‌కుమార్‌లు సూచించారు. గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందికి సీపీఆర్ ప్రక్రియ ద్వారా అవగాహన కల్పించారు. ఛాతి ప్రెషర్స్ 30, ఛాతి 2 నాడీలు వచ్చేవరకు రెండు నిమిషాల పాటు, ప్రెషర్ చేయాలని ఆరోగ్య సిబ్బందికి ఆయన సూచించారు. ఇలా 108 వచ్చేవరకు చేస్తూ ఉండాలని, అలాగే ఎడమవైపున పడుకోబెట్టినట్లయితే అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తిని కాపాడిన వాళ్ళమవుతామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రమోదిత, హెచ్ఈవోలు శ్రావణ్ కుమార్, కరిపే రవీందర్, పీహెచ్ఎన్ రాణి, ఆరోగ్య సూపర్వైజర్ మాలంబి, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్త కుమ్మరి సచిన్ ఇంటికి లక్ష్మీకాంత్ రావు

నవతెలంగాణ-మద్నూర్
జుక్కల్ నియోజకవర్గానికి కాంగ్రెస్ పార్టీ కొత్త రూపులు తీసుకురావడానికి కాంగ్రెస్ నాయకులు లక్ష్మీకాంతరావు విస్తృతంగా పర్యటిస్తున్నారు. కార్యకర్తలను కలుస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారు. మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త కుమ్మరి సచిన్ ఇంటికి వెళ్లి ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీకి కార్యకర్తలే పట్టుకొమ్మలని కార్యకర్తలు ఉంటేనే పార్టీ ఉంటుందని లక్ష్మీకాంతరావు పేర్కొన్నారు.

కన్నాపూర్ తండాలో కంటి వెలుగు ప్రారంభం

నవతెలంగాణ-రామారెడ్డి
మండలంలోని కన్నాపూర్ తండాలో కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ చందర్ నాయక్, వైస్ ఎంపీపీ రవీందర్‌రావుతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చందర్ నాయక్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం మారుమూల గ్రామాల ప్రజల కంటి సమస్యల పరిష్కారం కోసం, కంటి వెలుగు కార్యక్రమాన్ని రెండవ దఫా చేపట్టడంతో, ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని, ఈ అవకాశాన్ని తాండవాసులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సర్మన్ నాయక్, వైద్య సిబ్బంది, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, సెక్రటరీ రాములు, తాండవాసులు తదితరులు పాల్గొన్నారు.

విఠలేశ్వర, హనుమాన్ ఆలయాల నిర్మాణానికి రూ.51 వేల విరాళం


విరాళం అందజేస్తున్న గడుగు గంగాధర్

నవతెలంగాణ-మద్నూర్
మండలంలోని పెద్దశక్కర్గ గ్రామంలో విఠలేశ్వర, హనుమాన్ ఆలయాల నిర్మాణాల కోసం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్ రూ.51 వేలు విరాళంగా గురువారం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు రామ్ పటేల్ ఆధ్వర్యంలో గ్రామ పెద్దలకు ఆయన అందజేశారు. కార్యక్రమంలో చౌలవార్ హనుమాన్లు స్వామి, ఆ గ్రామస్తులు పాల్గొన్నారు.

లక్ష్మాపూర్‌లో రంజాన్ కానుకలు పంపిణీ

నవతెలంగాణ-వర్ని(చందూర్)
మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో నిరుపేద ముస్లింలకు రంజాన్ కానుకగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందించిన ఈద్ ముబారక్ తోఫాను సర్పంచ్ బోడ్డోల్ల సత్యనారాయణ గురువారం అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కోటగిరి అశ్విని సాయిలు, పార్టీ ప్రెసిడెంట్ రాములు, పార్టీ సీనియర్ నాయకులు నరెడ్ల పెద్ద నర్సింలు, మైనారిటీ సెల్ మండల అధ్యక్షులు సలీం, లింగేశం, పాలకవర్గ సభ్యులు బాబు, అజీం, నజీర్, యూసుఫ్, కోటగిరి సాయిలు, హైమద్‌ిస్సేన్, సమద్, మైబుబ్, గడ్డం సాయిలు, బుజ్జి, నీరడి పెద్ద సాయిలు తదితరులు పాల్గొన్నారు. అలాగే వర్ని మండలంలోని పాత వర్ని గ్రామంలో సర్పంచ్ పద్మ నాగభూషణం ఆధ్వర్యంలో ముస్లింలకు రంజాన్ పండగ కానుకలను పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపీపీ మేక శ్రీలక్ష్మి వీర్రాజు ప్రారంభించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు గిరి, ఏఎంసీ వైస్ చైర్మన్ గోపాల్, ఎంపీడీవో బసిరుద్దిన్, పీఏసీఎస్ చైర్మన్ నామాల సాయిబాబా, సర్పంచ్ పద్మ నాగభూషణం, పలువురు సీనియర్ నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు బహుమతులు పంపిణీ

నవతెలంగాణ-జుక్కల్
మండలంలోని ముస్లిం సోదరులకు రంజాన్ పండుగను పురస్కరించుకొని రాష్ట్రప్రభుత్వం తరపున దుస్తులను గురువారం పంపిణీ చేశారు. తహసీల్దార్ గణేష్ ఆధ్వర్యంలో ఈ పంపిణీ చేపట్టినుట ఆర్ఐ రామ్ పటేల్ తెలిపారు. కార్యక్రమంలో ముఖ్యఅథితిలుగా వైస్ ఎంపీపీ ఉమాకాంత్ కులకర్ణి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నీలుపటేల్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దాదారావ్, ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖ మంత్రిని కలిసిన బోధన్ ఎమ్మెల్యే

నవతెలంగాణ-రెంజల్
బోధన్ ఎమ్మెల్యే షకీల్ అమీర్, స్థానిక నాయకులు వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డిని గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినందుకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే బోధన్ మార్కెటింగ్ కమిటీ అభివృద్ధి కోసం సహకరించాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారని వారు పేర్కొన్నారు. చివరి వరకూ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుందని ఆయన వారికి హామీ ఇచ్చారు. ఆయన వెంట గిర్దావార్ గంగారెడ్డి, రెంజల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శేషుగారి భూమిరెడ్డి, రఫిక్ తదితరులు ఉన్నారు.

దళారులతో రైతులు మోసపోవొద్దు

- కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి
- పలుచోట్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నవతెలంగాణ-బోధన్/ఎడపల్లి
ప్రభుత్వం రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సాలూర సొసైటీ చైర్మెన్ అల్లె జనార్ధన్ అన్నారు. గురువారం సాలూర సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. దళారులకు విక్రయించి మోసపోవద్దన్నారు. ప్రభుత్వం రైతులకు అందించే పంట పెట్టుబడి పథకం, రైతుబీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సొసైటీ పరిధిలోని రైతుల ధాన్యాన్ని చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు. ఎవరూ ఆందోళన చెందవద్దని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బుద్దె సావిత్రి, వైస్ చైర్మెన్ సందీప్‌రెడ్డి, సంఘం కార్యదర్శి బస్వంత్ రావు పటేల్, డైరెక్టర్లు గంగారాం, దేవేదర్ పటేల్, రైతులు సాయరెడ్డి, కేజీ గంగారాం, లింబయ్య, నాగరాజు, లక్ష్మణ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి : రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి అధిక లాభాలు పొందాలని జైతాపూర్ సహకార సంఘం అధ్యక్షులు కరటూరి సత్యనారాయణ అన్నారు. గురువారం మండలంలోని జైతాపూర్ సహకార సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షులు సత్యనారాయణ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సహకార సంఘం ఉపాధ్యక్షులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, కార్యదర్శి సుభాష్, డైరెక్టర్లు స్థానిక సర్పంచ్ లక్ష్మి రాంగోపాల్‌రెడ్డి, ఉప సర్పంచ్ నర్సింలు, ఎంపీటీసీ పద్మ ముత్తన్న, స్థానిక ప్రజాప్రతినిధులు రైతులు తదితరులు పాల్గొన్నారు.


బోధన్ : ధాన్యం తూకం వేస్తున్న అల్లె జనార్ధన్

కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలి

- పలుచోట్ల కంటివెలుగు కేంద్రాలు ప్రారంభం

నవతెలంగాణ-విలేకరుల బృందం
సదాశివనగర్ : మండలంలోని మల్లుపేట్ గ్రామంలో కంటి వెలుగు కేంద్రాన్ని ఎంపీపీ గైని అనుసూయ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కమిలి నర్సింలు, ఎం.పి.టి.సి సుజాత, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వడ్ల రాజేందర్, నరేందర్‌రెడ్డి, సర్పంచ్ బాలకృష్ణ, సూపర్‌వైజర్ శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది నాగరాజు, ఏఎన్ఎంలు, ఆశకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఖండేబల్లూర్ కంటి వెలుగు శిబిరం సందర్శన..
జుక్కల్ : మండలంలోని ఖండేబల్లూర్ కంటివెలుగు టీం 2 శిబిరాన్ని ఎంపీవో యాదగిరి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీవో యాదగిరి మాట్లాడుతూ.. శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు శివరాజ్ దేశాయి, మారుతి, వైద్య బృందం, జేపీఎస్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


జుక్కల్ : శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీవో

బ్రాహ్మణపల్లిలో కంటి వెలుగు ప్రారంభం
ఎడపల్లి : మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో ఎంపీపీ శ్రీనివాస్ కంటి వెలుగు కార్యక్రమాన్ని గ్రామపంచాయతీ ఆవరణంలో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కే శ్రీనివాస్ మాట్లాడారు. సీఎం కేసీఆర్ రెండో విడత కంటి వెలుగు పథకాన్ని అమలు చేస్తూ గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేయించడం హర్షనీయమన్నారు. కంటి వెలుగు వైద్యులు స్థానిక ప్రజలకు ప్రత్యేక చికిత్స నిర్వహించి అద్దాలను అందజేస్తున్నారని ఆయన తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.
కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ లక్ష్మీ రాజేందర్‌రెడ్డి, ఎడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇన్చార్జి వైద్యాధికారి రాజ్‌కుమార్, ఎంపీటీసీ శ్రీ సుధా నాగేందర్‌రెడ్డి, గ్రామపం చాయతీ కార్యదర్శి, గ్రామపెద్దలు, అంగన్వాడీ ఉపా ధ్యాయులు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలను అరికడదాం


గాంధారి : పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

నవతెలంగాణ-మద్నూర్/గాంధారి
అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో వారోత్సవాల పోస్టర్లను మద్నూర్ తహసీల్దార్ అనిల్ కుమార్, సర్పంచ్ సురేష్, ఫైర్ స్టేషన్ అధికారి వినోద్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఫైర్ స్టేషన్ అధికారి వినోద్ మాట్లాడుతూ.. అగ్ని ప్రమాదాలను అరికడదాం జాతి సంపదను పెంపొందిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు రచ్చ కుశాల్, అగ్నిమాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గాంధారి : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో అగ్నిమాపక వారోత్సవాల వాల్‌పోస్టర్లను తహసీల్దార్ గోవర్ధన్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏప్రిల్ 14 నుంచి 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలు జరుగుతాయని తెలిపారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్త చర్యల గురించి ప్రచారం చేయాలని గాంధారి అగ్నిమాపక కేంద్ర సిబ్బందికి సూచించారు. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే 101నెంబర్‌కు సమాచారం అందించాలని తహసీల్దార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రవి, ఆర్ఐ నరసింహరెడ్డి, అగ్నిమాపక సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల, కళాశాల అభివృద్ధికి
దాతలు ముందుకు రావడం హర్షనీయం

- బోధన్ ఎమ్మెల్యే సతీమణి అయేషా ఫాతిమా బేగం

నవతెలంగాణ-ఎడపల్లి
విద్యారంగానికి స్వచ్ఛంద సంస్థలు అందజేస్తున్న చేయూతను సద్వినియోగం చేసుకోవాలని బోధన్ ఎమ్మెల్యే షకీల్ అమీర్ సతీమణి ఆయేషా ఫాతిమా బేగం అన్నారు. మండల కేంద్రంలోని తెలంగాణ గురుకుల బాలికల పాఠశాల కళాశాలకు అభయ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో అదనపు గది నిర్మాణానికి రూ.10 లక్షలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించి ఆమె మాట్లాడారు.. బోధన్ నియోజకవర్గ పరిధిలోని ఎడపల్లి తెలంగాణ గురుకుల పాఠశాల కళాశాల బాల బాలికలు చదువుతోపాటు ఆటపాట సాంస్కృతిక కార్యక్రమాలలో జాతీయ రాష్ట్రస్థాయి మండల స్థాయిలో మంచి పేరు ప్రతిష్ట తీసుకురావడం హర్షనీయమన్నారు. గత 2021-22 విద్యాసంస్థల కాలంలో పదవ తరగతి ఇంటర్, బైపీసీ, ఎంపీసీ సెకండ్ ఇయర్ బాలబాలికలు రాష్ట్రస్థాయిలోనే మంచి మార్కులు సాధించి పాఠశాలకు కళాశాలకు పేరు తేవడం సంతోషంగా ఉందని ఆమె కొనియాడారు. ఎడపల్లి ప్రెస్‌క్లబ్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు కదం ప్రకాష్ రావు సుమారుగా నాలుగు సంవత్సరాల కాలం నుంచి పాఠశాల, కళాశాల అభివృద్ధి కోసం ఆయన అందిస్తున్న స్వచ్ఛంద సేవలు చాలా గొప్పవని ఆమె అన్నారు. ప్రిన్సిపాల్ సుహాసినిరెడ్డి మాట్లాడుతూ.. గురుకుల పాఠశాలకు దాతలు అందజేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. దాతలు ఇచ్చిన విరాళాలను అభివృద్ధి పనులకు వెచ్చించి తమ పాఠశాలను విద్యారంగంలో తీర్చిది ద్దుతామని అన్నారు. దాతలు, సంస్థలు అందజేస్తున్న నిధులకు జవాబుదారీ తనం చూపిస్తామన్నారు. కార్యక్రమంలో బోధన్ ఏసీపీ కిరణ్ కుమార్, జెడ్పీ ఉపాధ్యక్షురాలు రజిత యాదవ్, ఎంపీపీ శ్రీనివాస్, ఎంపీటీసీ షేక్ జావిద్ బాబా, ఉపసర్పంచ్ ఆకుల శ్రీనివాస్, వెంకటేశ్వరశర్మ, ఎడపల్లి మండల ప్రెస్‌క్లబ్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు కదం ప్రకాష్ రావు, ప్రింట్ మీడియా ఉపాధ్యక్షులు పోశెట్టి, ఉపాధ్యాయులు నాగలక్ష్మి బాబు కిరణ్ శంకర్ గౌడ్, మాధురి, గౌతమి అధ్యాపక బృందం పాల్గొన్నారు.


భూమిపూజ చేస్తున్న పలువురు

పెద్దమ్మ ఆలయాభివృద్ధికి కృషి చేస్తా

నవతెలంగాణ-దోమకొండ
ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయం 25వ వార్షికోత్సవం సందర్భంగా పెద్దమ్మ పెద్దిరాజు ప్రత్యేక పూజ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్రంలోని ఆలయాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో ముదిరాజ్ కుల సంఘం సభ్యులు, అన్ని రంగాలలో రాణిస్తున్నారని తెలిపారు. అనంతరం ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్‌ను ముదిరాజ్ సంఘము సభ్యులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయం చైర్మన్ పున్న రాజేశ్వర్, జడ్పీ వైస్ చైర్మన్ ప్రేమ్ కుమార్, ఎంపీపీ శారదా, జడ్పీటీసీ తీర్మాల్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మధుసూదన్ రావు, సర్పంచ్ అంజలి, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు పున్న లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి బోయిని సత్యం, కోశాధికారి నర్సింలు, డైరెక్టర్‌లు పున్న రాములు, గరిగే సురేష్, గోపాల్, మహేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల భూమిని సర్వే చేయించాలి

నవతెలంగాణ-లింగంపేట్
ప్రభుత్వ పాఠశాల భూమిని వెంటనే సర్వే చేయించాలని నల్లమడుగు పెద్ద తాండ సర్పంచ్ రవీందర్ నాయక్ జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్‌కు గురువారం క్యాంప్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ నల్ల మడగు పెద్ద తండాలోని ప్రాథమిక పాఠశాలకు చెందిన భూమిని కొందరు కబ్జా చేశారన్నారు. వారిపై చర్యలు తీసుకుని వారి వద్ద నుంచి భూమిని స్వాధీనం చేసుకోవాలన్నారు. సర్వే నెంబర్ 154లో 1984 సంవత్సరంలో ప్రభుత్వం ఆ భూమిని పాఠశాలకు అప్పగించిందన్నారు. ప్రస్తుతం రెండు ఎకరాల భూమి ఎకరంపైన కబ్జాయిందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఆరోగ్య పరీక్షలు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి
మండల కేంద్రంలో భవన నిర్మాణ కార్మికులకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు గురువారం నిర్వహించారు. ఈ పరీక్షలను జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ సురేందర్ కుమార్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం కార్మికుల గురించి ఆలోచించి చాలా మంచి కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమానికి ఆయా గ్రామాల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

16న కాన్స్టిట్యూషనల్ మార్చ్‌ను విజయవంతం చేయండి

నవతెలంగాణ-లింగంపేట్/ తాడ్వాయి
ఈనెల 16న కామారెడ్డి జిల్లా కేంద్రంలో కాన్స్టిట్యూషనల్ మార్చ్‌ను విజయవంతం చేయాలని టీఎస్‌సీపీఎస్ఈయూ జిల్లా ఉపాధ్యక్షుడు ధారావత్ బాల్ సింగ్ పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని బాలుర పాఠశాలలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దుర్మార్గమైన నూతన పెన్షన్ విధానాన్ని తీసివేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని అన్నారు. వృద్ధాప్యంలో పెన్షన్ లేని ఈ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. పాత పెన్షన్ విధానం అమలుకై రాష్ట్రవ్యాప్త ఉద్యమాలకు పిలుపునిచ్చిందని, అందులో భాగంగా ఏప్రిల్ 16 కామారెడ్డి జిల్లాలో పొట్టి శ్రీరాములు విగ్రహం దగ్గర నుంచి సరస్వతీ శిశు మందిర్ పాఠశాల వరకు ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. అలాగే జూన్ మొదటి వారంలో రాష్ట్రవ్యాప్తంగా బస్సు యాత్ర నిర్వహిస్తామని తెలిపారు. ఉపాధ్యా య ఉద్యోగులందరూ హాజరై ర్యాలీని దిగ్విజయం చేయాలని కోరారు.


తాడ్వాయిలో..

తాడ్వాయి : కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించే ర్యాలీని విజయవంతం చేయాలని టీఎస్‌సీపీఎస్ఈయూ తాడ్వాయి మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గెర్మబోయి బాబా, బాబాగౌడ్ పిలుపునిచ్చారు. మండలంలోని కృష్ణాజివాడి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో జరిగిన సమావేశంలో టీఎస్‌సీపీఎస్ఈయు రాష్ట్ర సాహిత్య కమిటీ సభ్యులు విజయవర్ధన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పాత పెన్షన్ పునరుద్ధరణ జరిగే వరకు మనం సంఘటితంగా పోరాటాలు చెయ్యాలని తెలిపారు. సమావేశంలో కృష్ణాజివాడి పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు వేణుగోపాల్, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-బోధన్
ఏప్రిల్ 16, 17, 18 తేదీల్లో తిరుపతిలో జరిగే ఐఎఫ్‌టీయూ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షులు దాసు అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని రాకాసిపేటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 76సంవత్సరాల స్వతంత్ర భారతంలో కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను నరేంద్ర మోడీ ప్రభుత్వం హరిస్తుందని అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ సబ్‌కా వికాస్ నినాదం నీళ్ల మూటగా మారిందన్నారు. దేశంలోని 60 శాతం సంపద కేవలం ఐదు శాతం సంపన్నుల వద్ద పోగు పడిందని ఆక్స్ ఫామ్ నివేదిక ప్రకటించిందని అన్నారు. మానవాభివృద్ధి సూచికలో ప్రపంచంలోని 191 దేశాల జాబితాలో భారతదేశం 132కి, ఆకలిలో 107వ స్థానం పర్యావరణలో 108 స్థానానికి దిగజారిందని, పత్రికా స్వేచ్ఛలో 150వ స్థానంలో ఉందని నివేదిక పరిశీలిస్తే దేశం ఎటువైపు పోతుందో స్పష్టమవుతుందన్నారు. 9 ఏండ్లలో మత విద్వేషాలు రెచ్చగొడుతూ సమాజాన్ని విభజించి పాలించుటకు అనేక చర్యలకు పాల్పడిందని ఆయన అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మివేస్తూ, ఉద్యోగ ఉపాధి భద్రతకు ప్రమాదం కలిగిస్తూ దేశంలో ఆకలి సమస్యలు తీవ్రం చేస్తోందని ఆయన పేర్కొన్నారు. కరోనాతో కార్మికులు కష్టాలు అనుభవించగా కార్పొరేట్ కంపెనీ అధినేతలు వేల కోట్ల రూపాయలు అక్రమ సంపాదన పెంచుకున్నారని ఆయన అన్నారు. నాలుగు లేబర్ కోడుల పేరుతో కార్మిక హక్కులను కాలరాసి, శ్రమదోపిడీకి ఎగపడుతుందని, కార్మికులు ఎదుర్కొంటున్న ప్రమాదకర సమస్యలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ ఈ మహాసభల్లో రూపొందిస్తారని ఆయన తెలిపారు. ఏప్రిల్ 16న ఐఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షురాలు అపర్ణ అధ్యక్షతన జరిగే బహిరంగ సభలో రిటైర్డ్ ప్రొఫెసర్ కేయూసీ వరంగల్ కే. కాత్యాయిని విద్మేహి ముఖ్యఅతిథిగా, ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రదీప్, ప్రసాద్ ప్రసంగిస్తారని ఆయన తెలిపారు. ఈ సభలను ఆర్థికవేత్త జెఎన్‌టీయూ ప్రొఫెసర్.డాక్టర్ అరుణ్ కుమార్ ప్రారంభిస్తారని తెలిపారు. దేశంలోని నలుమూలల నుంచి 500ల మంది ప్రతినిధులు పాల్గొంటారని ఆయన తెలిపారు. సమావేశంలో నాయకులు దాల్ మల్కా పోశెట్టి, వెండి శంకర్, వెంకటేష్, శివ కుమార్, సాయిబాబా, రాజన్న, టి.రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యూచర్ ఇంటర్వేటర్స్ ఫైర్‌లో పడగల్ విద్యార్థులు

నవతెలంగాణ-(వేల్పూర్)ఆర్మూర్

వేల్పూర్ మండలంలోని పడగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థిని అలేఖ్య, 8వ తరగతి విద్యార్థిని అలోక్ష గురువారం ఐఐటి హైదరాబాద్ వారు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతిభను కనబరిచి డైరెక్టర్ మూర్తితో మెమోంటోలను అందుకున్నారు. ఈ కార్యక్రమానికి గైడ్ టీచర్లుగా మంచిర్యాల సురేష్ కుమార్, శంకర్ పాల్గొన్నారు.



దివ్యాంగులకు రూ.15వేల పెన్షన్ మంజూరు చేయాలి

- జిల్లా అధ్యక్షులు గోపు శ్రీకాంత్ యాదవ్

నవతెలంగాణ-ముప్కాల్

రాష్ట్రంలో దివ్యాంగులు ఎదురుకుంటున్న సమస్యలని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని దివ్యాంగుల విజ్ఞాన సేవా సమితి జిల్లా అధ్యక్షులు గోపు శ్రీకాంత్ యాదవ్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలను దృష్టిలో పెట్టుకుని వికలాంగులకు నెలకు రూ.15 వేల పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. ప్రస్తుత జనాభా ప్రాతిపదికన వందలో ఏడుగురు వికలాంగులు ఉన్నారని గుర్తుచేశారు. ప్రభుత్వం వికలాంగులకు చిన్నచూపు చూడడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గోపు శ్రీకాంత్ యాదవ్, శ్రీరామ్ సాగర్, శంకర్ దాస్, సాయన్న, సుఖిదాస్, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు..

పెన్షన్ కాన్స్టిట్యూషనల్ మార్చ్‌కు సంపూర్ణ మద్దతు

- టీటీజీడీఏ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఈనెల 16న టిఎస్సీపిఎస్ఈయు చేపట్టిన పెన్షన్ కాన్స్టిట్యూషనల్ మార్చ్‌కు తెలంగాణ రాష్ట్ర టీచింగ్ ప్రభుత్వ వైద్యుల సంఘం సంపూర్ణ మద్దతు అందిస్తుందని టిటిజిడిఏ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ అన్వర్, డాక్టర్ జలగం తిరుపతి రావు లు అన్నారు. కాన్స్టిట్యూషనల్ ర్యాలీని విజయవంతం చేయాలని సభ్యులను కోరారు. సిపిఎస్ ఉద్యోగుల ఆకాంక్షను ప్రభుత్వాలకు తెలిపే ఆత్మగౌరవ ర్యాలీని, విజయవంతం చేయడం మనందరి బాధ్యత అని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో పాత పెన్షన్ సాధన కోసం నిర్వహించే కాన్స్టిట్యూషనల్ మార్చ్ ర్యాలీలో సిపిఎస్ డాక్టర్లు పెద్ద ఎత్తున పాల్గొంటారని టిటిజిడిఏ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ అన్వర్, డాక్టర్ జలగం తిరుపతి రావు, ఉపాధ్యక్షులు డాక్టర్ కిరణ్ మాదాల, డాక్టర్ ప్రతిభాలక్ష్మి తెలిపారు.

స్వయం ఉపాధితో కుటుంబానికి భరోసాగా నిలవాలి

- డీఆర్‌డీఏ, డీఆర్డీవో పీడీ చందర్ నాయక్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మంచిగా శిక్షణ నేర్చుకొని జీవితంలో ఎవరికి వారే స్థిరపడాలని, ఇదే కాకుండా కుటుంబానికి పెద్ద దిక్కుగా, భరోసాగా నిలవాలని డీఆర్‌డీఏ, డీఆర్‌డీవో పీడీ చందర్ నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎస్‌బిఐ ఆర్‌ఎస్‌ఈసిటిఐలో మగ్గం వర్క్ కుట్టు మిషన్ శిక్షణ రెండు బ్యాచ్‌లను దీపారాధన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మగ్గం అండ్ టైలరింగ్ చాలా మంచి డిమాండ్ ఉన్న శిక్షణలని వీటిని నేర్చుకోవడం ద్వారా చాలా మంచి ఇప్పటికే ఉపాధి పొందుతున్నారని తెలిపారు. ఇక్కడ మగ్గం, టైలరింగ్ నేర్చుకున్న వాళ్ళు ఎంతో మంది జీవితంలో మంచిగా స్థిరపడి నెలకు 40 వెల రూపాయలు సంపాదిస్తున్నారని వివరించారు. శిక్షణ అనంతరం మహిళ సంఘాల ద్వారా రుణం తీసుకొని వ్యాపారంలో పెట్టుబడి పెట్టి స్థిరపడాలని సూచించారు. అనంతరం డైరెక్టర్ మాట్లాడుతూ డ్వాక్రా గ్రూపుల ద్వారా, బ్యాంక్‌ల ద్వారా కూడా రుణలను ఇప్పిస్తు న్నామని ఆర్‌ఎస్‌ఈసిటిఐలో ఉండే శిక్షణలు, సదుపాయాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏపిఎం రచయ్య, సంస్థ సిబ్బంది రామకృష్ణ, నవీన్, గెస్ట్ ఫ్యాకల్టీలు ఫరీద, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీడీ చందర్ నాయక్

వేసవిలోనే బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

- టీఎస్‌యూటీఎఫ్

నవతెలంగాణ-భీమ్‌గల్

బదిలీలపై హైకోర్టులో నడుస్తున్న కేసు జూన్ 13 కు వాయిదా పడటం విచారకరమని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మల్క జనార్దన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేసు వాయిదాను నెలాఖరులోగా ముందుకు జరిపే విధంగా విద్యాశాఖ అధికారులు ప్రయత్నం చేయాలని, తద్వారా వేసవి సెలవుల్లోనే బదిలీలు, పదోన్నతులు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఒకవేళ అది సాధ్యం కాని పక్షంలో తాత్కాలిక ప్రాతిపదికన పదోన్నతులు అయినా కల్పించాలని కోరారు. ఎనిమిదేళ్ళుగా పదోన్నతులు లేక అర్హులైన ఉపాధ్యాయులు నష్టపోతున్నారని, పాఠశాలల్లో ఖాళీ పోస్టుల వల్ల విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతున్నదని పేర్కొన్నారు. పదోన్నతులు ఇస్తేనే నియామకాలకు ఖాళీలపై పూర్తి స్పష్టత వస్తుందని తెలిపారు. కనుక వేసవి సెలవుల్లో బదిలీలు, పదోన్నతులు పూర్తి చేసి ప్రత్యక్ష నియామకాలకు నోటిఫికేషన్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈమేరకు వేగంగా చర్యలు తీసుకోవాలని ఆయన విద్యాశాఖ కార్యదర్శిని, సంచాలకులను కోరారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి



కంటివెలుగును ప్రారంభించిన సర్పంచ్ సిద్ధార్థ

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని మంచిప్ప గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ ఇందూరు సిద్ధార్థ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు పైబడి కంటి సమస్యలున్న ప్రతి ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకుని వారికి కావాల్సిన కంటి అద్దాలతో పాటు ఐ డ్రాప్స్ తీసుకోవాలని అన్నారు 15 రోజుల వరకు కంటి వెలుగు శిబిరం గ్రామంలో రైతు వేదికలో నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ జగదీష్, కో ఆప్షన్ అజీమ్, వీడీసి ప్రెసిడెంట్ నవీన్, సభ్యులు శ్రీనివాస్, ముత్యం, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాడుదాం

- నేడు చలో మంచిర్యాల్‌కు పిలుపునిచ్చిన కాంగ్రెస్ పార్టీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రజాస్వామ్య పరిరక్షణకై పోరాడుదాం రండి అని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి కాంగ్రెస్ భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మానాల మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో జరుగుతున్న అక్రమాలు, అవినీతిని, జాతి సంపదను దోచిపెడుతున్న విధానాన్ని ఎండగడుతూ, అదానికి మోడీకి ఉన్న సంబంధాన్ని ప్రశ్నించినందుకు కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీపై కేసు వేసి రెండు సంవత్సరాల జైలు శిక్ష పడే విధంగా చేశారన్నారు. పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయడాన్ని, అధికారిక నివాసాన్ని ఖాళీ చేయమని నోటీసు ఇచ్చిన బిజెపి కుట్రపూరిత చర్యలను ఎండగట్టడానికి శుక్రవారం మంచిర్యాలలో జై భారత్ సత్యాగ్రహ సభను నిర్వహించడం జరుగుతుందని, తెలిపారు. సీఎల్పీ నాయకులు భట్టి విక్రమార్క పాదయాత్రలో భాగంగా నిర్వహిస్తున్న ఈ సత్యాగ్రహ సభకు కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ కార్గే, పిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి, హాజరవుతున్నారని తెలిపారు. జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, ప్రజలు అందరూ కలిసి సత్యాగ్రహ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రామర్తి గోపి, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు వేణురాజ్, ఓబీసీ .జిల్లా అధ్యక్షులు రాజ నరేంద్ర గౌడ్, జిల్లా సేవాదల్ అధ్యక్షులు సంతోష్, ఎన్ఎస్‌యూఐ నాయకు పాల్గొన్నారు.

ఐఐటీలో నలంద విద్యార్థుల ప్రభంజనం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మామిడిపల్లి నలంద పాఠశాల ఐఐటి ఒలంపియాడ్‌లో మూడవ తరగతి నుండి 9వ తరగతి వరకు విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయిలో మొదటి మూడు ర్యాంకులు సాధించి నలంద కీర్తి ప్రతిష్ఠలను రెట్టింపు చేశారని పాఠశాల కరస్పాండెంట్ ప్రసాద్ ప్రిన్సిపాల్ సాగర్ గురువారం తెలిపారు. గత నెల ఈ అబ్యాస్ ఐఐటి హైదరాబాద్ అకాడమీ వారు నిర్వహించిన గ్రాండ్ ఒలంపియాడ్, ఐఐటి పరీక్షలో 10 జిల్లాల నుండి 450 విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. ఇందులో నలంద విద్యార్థులు సుమారు 17 మంది ఉత్తమ ప్రతిభను కనబరిచారని చెప్పారు. ఈనెల 16 న (ఆదివారం)హైదరాబాదులో ఈ అభ్యాస్ వారి ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్ర భారతి ఆడిటోరియంలో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు సన్మాన సభ నిర్వహిస్తు న్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి నలంద స్కూల్ ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు హాజరు కావాలని ఆహ్వాన పత్రికను నలంద యాజమాన్యానికి ఈ అబ్యాస అకాడమీ తెలంగాణ ఇంఛార్జి మణికంఠ అందచేశారని తెలిపారు. ర్యాంకులు సాధించడానికి కారణమైన ఐఐటి ఉపాధ్యాయ సిబ్బంది హన్మండ్లు, సందీప్, అక్షయ్, స్రవంతి, కవిత, పవిత్రను నలంద యాజమాన్యం అభినందించారు.



ఐఐటీ ఒలంపియాడ్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

ఇళ్ళ స్థలాలను గుర్తించండి

- ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను కలిసిన మీడియా ప్రతినిధులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ ఎలక్ట్రానిక్ మీడియా నూతన కమిటీ అధ్యక్షులు చిన్ను అధ్వర్యంలో సభ్యులతో గురువారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్చం అందజేశారు. నూతన కమిటీ వివరాలను ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు వివరించారు. నియోజకవర్గంలో విలేకరులు ఎదుర్కొంటున్న సమస్యల్ని ఆయన దృష్టికి తీసుకొని వచ్చారు. ఈ సందర్భంగా తమ సమస్యలను ఎమ్మెల్యేకు కమిటీ ప్రతినిధులు వివరించారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల ఇవ్వడానికి ప్రభుత్వ స్థలం ఎంపిక చేయాలని డిచ్ పల్లి తహసీల్దార్ శ్రీనివాస్ రావుకు ఫోన్ ద్వారా ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఆదేశించారు. అనంతరం నూతన కమిటీ అధ్యక్షుడు చిన్నూ, ప్రధాన కార్యదర్శి రమేష్, కార్యవర్గ సభ్యులు, సురేందర్, మోహమ్మద్ అప్సర్, సురేష్, ప్రశాంత్, రామకృష్ణ, వెంకటేశ్వర్, వంశీలను ఎమ్మెల్యే, అభినందించారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రమేష్, సురేష్, సురేందర్ అప్సర్, ప్రశాంత్, వంశీ తదితరులు పాల్గొన్నారు.



బొకేను అందజేస్తున్న మీడియాప్రతినిధులు

సాయిరాజ్‌యాదవ్‌కు సామాజిక సేవా పురస్కారం

నవతెలంగాణ-ముప్కాల్

తెలుగు వెలుగు సాహితీ వేదిక స్వచ్ఛంద సేవాసంస్థ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలుగు వెలుగు ఉగాది మహానంది జాతీయ ఉత్తమ సామాజిక సేవా రంగంలో పురస్కారం మండలం లోని వేంపల్లి గ్రామానికి చెందిన సాయిరాజ్ యాదవ్ అందుకున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి తెలుగు వెలుగు సాహితి జాతీయ మహానంది పురస్కారం అందజేశారు. హైదరాబాద్‌లోని త్యాగరాయగాన సభలో సరస్వతి మాత ఉపసకులు డాక్టర్ దైవజ్ఞ శర్మ గిన్నిస్ వరల్డ్ రికార్డ్ గ్రహీత వంగాల శాంతి కృష్ణ ఆచార్య చేతుల మీదుగా జాతీయ ఉత్తమ సామాజిక సేవ రంగంలో మహానంది పురస్కారంతో పాటు జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ మనోజ్ యాదవ్, తెలుగు వెలుగు సాహిత్య వేదిక సంస్థ చైర్మన్ పోలోజు రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సాయిరాజ్ యాదవ్‌ను సన్మానిస్తున్న ప్రముఖులు

రైతన్నలకు ఏ కష్టం వచ్చినా వెన్నంటే ఉంటా

- మాజీ ఎమ్మెల్సీ వి. గంగాధర్ గౌడ్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

రైతన్నలకు ఏ కష్టం వచ్చినా వారి వెన్నంటే ఉంటానని, రైతులను ఆదుకోవడానికి ముఖ్యమంత్రి కెసిఆర్ వందల కోట్లు ఇచ్చి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయిస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. గంగాధర్ గౌడ్ అన్నారు. బుధవారం డిచ్‌పల్లి మండలంలోని రాంపూర్ డి, ఇందల్‌వాయి మండల కేంద్రంలోని తిర్మన్ పల్లి గ్రామాల్లో రాంపూర్ సహకార సొసైటీ ఆధ్వర్యంలో నెలకొల్పిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను అయన చైర్మన్ తారాచంద్ నాయక్, సర్పంచులు పాపాయి తిరుపతి, తేలు గణేష్, సంతోష్ నాయక్, ఎంపిటిసి చింతల దాస్, కో ఆప్షన్ సభ్యులు షేక్ హుస్సేన్ ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. నిజామాబాద్ రూరల్‌లో మొదటిసారిగా రాంపూర్ సహకార సొసైటీలో ప్రారంభించ్చు కోవడం అభినంద నీయమన్నారు. ధాన్యం కొనుగోలుకు సీరియల్ పెట్టుకోవాలని, ఏమైనా ఇబ్బందులు ఉంటే చైర్మన్ తారాచంద్ నాయక్‌ను పాలక వర్గం, సర్పంచులు, ఎంఎటీసీల దృష్టికి తీసుకొని రావాలని ఆయన సూచించారు. అనంతరం గంగాధర్ గౌడ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఇందల్‌వాయి సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు రఘునాథన్ రాము, రాంపూర్ ఉప సర్పంచ్ ఎంకన్నోల్ల రమేష్, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు రాజ్ కుమార్, వైస్ చైర్మన్ స్వామి, డైరెక్టర్లు బొక్క గంగాధర్, మేకల రమేష్, ధర్పల్లి ప్రభాకర్, రైతు సమన్వయ కమిటీ అధ్యక్షులు నారాయణ రెడ్డి, బీఆర్ఎస్ మం డల ఉధ్యక్షులు బిరిష్ శెట్టి, తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు ప్రారంభించిన ఎమ్మెల్సీ

జాతీయ మహాసభను విజయవంతం చేయండి

- ఐఎఫ్‌టీయూ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

పట్టణంలో జరిగే ఐఎఫ్‌టీయూ ఏడవ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని హమాలీ ఫేడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.శివకుమార్ అన్నారు. తెలంగాణ ప్రగతిశీల హమాలీ, మిల్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శ్రద్ధానంద్ గంజ్ హెూల్సేల్ కూరగాయల మార్కెట్లో తిరుపతిలో జరిగే జాతీయ ఏడవ మహాసభల పోస్టర్ గురురవాం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకోసం సంక్షేమ బోర్డు తెస్తామని చెప్పి తేలేదన్నారు. బరువులు మోసి హమాలి కార్మికులు 50 సంవత్సరాలు దాటిన తర్వాత వెన్నుపూస సమస్యలతో ఇంటికే పరిమితం అవుతున్నారన్నారు. హమాలికార్మికుడికి నెలకు 5000 రూపాయల పెన్షన్ ఇవ్వాలని, ప్రభుత్వం నుంచి గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, ప్రైవేటీకరణను ఆపాలని కోరారు. ఈ మహాసభలలో లేబర్ కోడ్ల గురించి చర్చించి, భవిష్యత్తు కార్యాచరణపై చర్చించుకుంటామని తెలిపారు.

కలెక్టర్, అదనపు కలెక్టర్‌ను కలిసిన టీఎన్జీవోస్ నూతన కార్యవర్గం

నవతెలంగాణ-కంఠేశ్వర్

టీఎస్‌జీవోఎస్ నూతన కార్యవర్గం గురువారం నిజామాబాద్ జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించి టీఎన్జీవోఎస్ నూతన పత్రాలను అందజేశారు. అనంతరం సభ్యులను జిల్లా ఉన్నతాధికారులకు టీఎన్జీవో జిలాల అధ్యక్షులు అలుక కిషన్ పరిచయం చేశారు. వారికి కలెక్టర్ , అదనపు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. గత కార్యవర్గంలా ఈ కార్యవర్గం పనిచేసి జిల్లాను ముందంజలో ఉంచాలని పేర్కొన్నారు. ఎలాంటి సమస్యలున్నా సమాచారం అందించి పరిష్కారానికి ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందని అధికారులు సంబంధిత సిబ్బందికి తెలిపారు. కార్యక్రమంలో నూతన జిల్లా టీఎన్జీవోఎస్ కార్యవర్గంతో పాటు ఉద్యోగులు పాల్గొన్నారు.

పీఎఫ్ కమిషనర్ కార్యాలయ అవినీతి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

- బీఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్



నవతెలంగాణ-కంఠేశ్వర్

పీఎఫ్ కమిషనర్ కార్యాలయం అవినీతి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని బిఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు దండివెంకట్ డిమాండ్ చేశారు. గురువారం నిజామాబాద్ జిల్లాలోని వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికలకులు మున్సిపల్, బీడీ, ఆర్టీసీ, ప్రభుత్వ ప్రైవేట్ సంస్థల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికుల పీఎఫ్ డబ్బులు చెల్లించడంలో ఈపీఎఫ్ కమిషనర్ కార్యాలయం సిబ్బంది అవినీతి పై విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ బహుజన లెఫ్ట్ ట్రేడ్ యూనియన్స్ బిఎల్‌టీయూ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్, ప్రధాన కార్యదర్శి సిరిగాద సిద్దిరాములు మాట్లాడుతూ.. పీఎఫ్ కార్యాలయం నిర్లక్ష్యం వల్ల కార్మికులు మృతి చెందిన, వయోభారంతో ఉద్యోగ విరమణ చేసిన పిఎఫ్ డబ్బులు పొందేందుకు పీఎఫ్ కమిషనర్ కార్యాలయం చుట్టూ సంవత్సరాల తరబడి తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఆయా కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. సంవత్సరం కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం పీఎఫ్ కమిషనర్ కార్యాలయ ఇన్‌చార్జీకి విచిత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఎల్‌టీయూ జిల్లా అధ్యక్షులు కె.మధు, ప్రధాన కార్యదర్శి మేకల రాజేందర్, జిల్లా ఉపాధ్యక్షులు సయ్యద్, బహుజన శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ ఆశాబాయి, నగర కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి గంగా శంకర్, యాదయ్య హరీష్, శంకర్ పాల్గొన్నారు.

రోజంతా వ్యాపార సముదాయాలు తెరిచి ఉంచే ఆలోచన మనుకోవాలి

- ఏఐటీయూసీ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

రోజంతా వ్యాపార సముదాయాలు తెరిచి ఉంచాలనే ప్రభుత్వ ఆలోచనను విరమించు కోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై. ఓమయ్య అన్నారు. ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లా డారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రోజంతా వ్యాపార సముదాయాలు తెరిచి ఉంచుకోవచ్చని విడుదల చేస్తున్నటువంటి నూతన జీవోను ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. కార్మికులు పోరాడి సాధించుకున్న షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం అమల్లో ఉంటేనే ఎక్కడ కూడా వ్యాపార సముదాయాల్లో 8 గంటల పని ప్రావిడెంట్ ఫండ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్, పని గ్యారంటీ చట్టాలు అమలు కానటువంటి పరిస్థితులు ఉన్నాయన్నారు. వ్యాపార సంస్థల్లో కార్మికులు 12నుండి 15 గంటలు పనిచేస్తున్న పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం రోజంతా వ్యాపారాలు నడుపుకోవచ్చని ఆదేశించడం అంటే కార్మికుల శ్రమను దోపిడీ చేయడం తప్ప మరొకటి కాదని అన్నారు. కార్మిక చట్టాలు అమలు చేయాలని కార్మిక శాఖ అధికారులు, ప్రభుత్వ అధికారులకు ఎన్ని అర్జీలు ఇచ్చినా స్పందన ఉండటం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం 43 రకాల కార్మిక చట్టాల ను రద్దు చేసి, నాలుగు కార్మిక వ్యతిరేక కోడ్లను తీసుకొచ్చిన దాంట్లో భాగంగానే ఈ జీవో వస్తున్నట్టుగా ఏఐటీయూసీ భావిస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆ జీవోను వెనక్కి తీసుకోవాలని లేకుంటే పోరాటం నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు పి.నర్సింగరావు, జిల్లా సహాయ కార్యదర్శి పి.హనుమాన్లు, ఉపాధ్యక్షులు కే.రాజన్న, సక్కి సురేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఓమయ్య

ఉత్తమ గ్రామపంచాయతీ అవార్డు గ్రహీతకు సన్మానం



సర్పంచ్, వీడీసీ సభ్యులు, పెద్దకాపులను సన్మానిస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని గోవింద్‌పేట్ గ్రామపంచాయతీ అవార్డు గ్రహీతకు సర్పంచ్ బండమీది జమున గంగాధర్ 2022 -23 వీడిసి సభ్యులకు మున్నూరు కాపు పాత పెద్దకాపులకు గ్రామస్తులు గురువారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘ సభ్యులు సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-ఏర్గట్ల

మండల కేంద్రానికి చెందిన గూండ్ల సుధీర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు.వారిది పేద కుటుంబం కావడంతో ఆరేంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల సునీల్ రెడ్డి వైద్య ఖర్చుల నిమిత్తం ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం కింద 5వేల రూపాయలను పంపించారు. సునీల్ యువసేన సభ్యులు వారి కుటుంబానికి ఆర్థికసాయం గురువారం అందజేశారు.



ఆర్థికసాయం అందజేస్తున్న సునీల్ యువసేన సభ్యులు

డిచ్‌పల్లి ఎంపీఓ మృతి

- విధుల్లో చేరిన రెండురోజులకే ఘటన

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్‌పల్లి ఎంపీఓగా రెండురోజులక్రితం చేరిన నాగేంద్రప్ప బుధవారం రాత్రి తన ఇంట్లోనే పడుకున్న సమయంలో గుండెపోటు వచ్చి మృతిచెందారు. నిజామాబాద్ నగరంలోని ఆర్యనగర్ బ్యాంకు కాలనీలో ఈఘటన చోటుచేసుకుంది. డిచ్‌పల్లి ఎంపిఓగా భాధ్యతలు స్వీకరించిన తర్వాత విధుల్లో నిర్లక్ష్యం, తదితర విషయాలపై పలువురు అప్పటి కలెక్టర్ నారాయణరెడ్డికి ఫిర్యాదు చేశారు. వెంటనే ఎనిమిది నెలల క్రితం నాగేంద్రప్పను సస్పెండ్ చేశారు. ఆయన స్థానంలో నడ్పల్లి గ్రామ పంచాయతీ గ్రేడ్ వన్ కార్యదర్శి నిట్టు కిషన్ రావు ఇంచార్జీ ఎంపిఓ గా భాద్యతలు చేపట్టారు. సస్పెండ్ ఎత్తివేసి తిరిగి డిచ్ పల్లి ఎంపిఓ గా రెండు రోజుల క్రితం విధుల్లో చేరారు. ఇంతలోనే మృతి చెందడంతో కుటుంబంలో, మండల పరిషత్ కార్యాలయంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.



16న సీపీఐ జిల్లా కమిటీ సమావేశం

నవతెలంగాణ-ఆర్మూర్

సీపీఐ జిల్లా కమిటీ సమావేశం ఈ నెల 16న ఆదివారం ఉంటుందని సీపీఐ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి అరేపల్లి సాయిలు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పట్టణంలో సీపీఐ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం అనంతరం నిజామాబాద్ జిల్లా కమిటీ సమావేశం ఉంటుందన్నారు. సమావేశానికి రాష్ట్ర నాయకులు పశ్య పద్మ వస్తున్నారని తెలిపారు.

వరి ధాన్యం అరబెట్టడానికి స్థల పరిశీలన

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండల కేంద్రంలోని ఘన్‌పూర్ గ్రామంలోని చెరువులో వడ్లుఆరబెట్టడానికి స్థలాన్ని గురువారం ఖిల్లా డిచ్ పల్లి సహకార సొసైటీ చైర్మన్ గజవాడ జైపాల్, డైరెక్టర్, ప్రజా ప్రతినిధులు, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఘన్ పూర్ గ్రామానికి చెందిన రైతులకు వరి ధాన్యం ఒక చోటికి తరలించడానికి స్థలం లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గ్రామానికి అనుకుని ఉన్న చెరువులో వడ్లు వేసుకోవడానికి స్థలం ఉందని, ఈసారి రైతులు అక్కడికే వరి ధాన్యం తీసుకొని రావాలని సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్ సతీష్ రెడ్డి, ఎంపీటీసీ రామకృష్ణ, ఉప సర్పంచ్ రంజిత్, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండల పరిధిలోని మల్లయ్యపల్లి గ్రామానికి చెందిన గడ్డం దుర్గవ్వ అనే మహిళ భూమి కోసం ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటన గురువారం చోటచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం అదే గ్రామ శివారుకు చెందిన ఒక గుంట భూమిని గడ్డం దుర్గవ్వ భర్త సాయిలు అదే గ్రామానికి చెందిన బొన గిరి పర్వయ్యకు అమ్మారు. ఆ స్థలంలో రేకుల షెడ్డు వేస్తుండగా దుర్గవ్వ అనే మహిళ అడ్డుకుంది. వినకపోవడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకుంది. ఈ విషయంపై పోలీసులకు వివరణ కోరగా 20 సంవత్సరాల క్రితం భూమి అమ్మింది వాస్తవమేనని కొన్న వారి మీద భూమి పట్టా మార్పిడి కాలేదని ఎల్లారెడ్డి ఎస్ఐ గణేష్ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గణేష్ తెలిపారు.

20నుంచి బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇటీవల వాయిదా పడిన తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని అన్ని అనుబంధ బిఈడి కళాశాలలకు మొదటి సెమిస్టర్ రెగ్యులర్ థియరీ పరీక్షలు ఈనెల 20 నుంచి ప్రారంభమవుతాయని తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారిణి ప్రొఫెసర్ డాక్టర్ ఎం. అరుణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించిన పరీక్ష తేదీల షెడ్యూల్‌ను ఆమె విడుదల చేశారు. బీఈడీ మొదటి సెమిస్టర్ విద్యార్థులు ఈ విషయం గమనించాలని కోరారు. పూర్తి వివరాలకు ఒ్ఒ్.వశ్రీఖఅస్త్రుఆఖబఆఱ-జవటీంప్ఎ.ఖఒ.ఱఅ సంప్రదించాలని సూచించారు.

ఉక్కపోతతో విద్యార్థులు సతమతం



నవతెలంగాణ-బోధన్

అసలే ఎండాకాలం. గరిష్ట ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలకు చేరుకుంది. ఎండ వేడిమికి జనం తట్టుకోలేక పోతున్నారు. కాగా స్కూళ్లల్లో ఉక్కపోతతో విద్యార్థులు సతమతమవుతున్నారు. ప్రస్తుతం ఎస్ఏ-2 పరీక్షలు రాస్తున్న విద్యార్థులు ఎండ వేడిమికి ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నారు. బోధన్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల రాకాసిపేటలో గత రెండు రోజులుగా కరెంటు సరఫరాలో ఇబ్బందులు తలెత్తడంతో కరెంటు సరఫరా నిలిచిపోయింది. దాంతో పరీక్ష హాలులో విద్యార్థులు ఉక్కపోత భరించలేక ఇబ్బందులు పడవలసి వచ్చింది. కరెంటు సరఫరా లేకపోవడంతో ఫ్యాన్ లు పనిచేయక ఉక్కపోతను భరించలేకపోయారు. అంతేకాకుండా విద్యార్థులకు తాగునీటి ఇబ్బందులు ఏర్పడ్డాయి. దాంతో మున్సిపల్ ట్యాంకర్ ద్వారా తాగునీటిని అందించాల్సి వచ్చింది. అవి కూడా సరిపోకపోవడంతో విద్యార్థులు దాహంతో ఇబ్బందులు పడవలసి వచ్చింది. అధికారులు విద్యార్థుల పరీక్షలు ముగిసే వరకు నిరంతరం కరెంటు సరఫరా చేయాలని, తాగునీటి సౌకర్యం కల్పించాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

18వ వార్డులో కంటి వెలుగు



కంటివెలుగును ప్రారంభించిన చైర్‌పర్సన్

నవతెలంగాణ-ఆర్మూర్

కంటి వెలుగు రెండో విడత కార్యక్రమాన్ని పట్టణంలోని 18 వవార్డు లో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీత పవన్, వార్డు కౌన్సిలర్ వనం శేఖర్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు పైబడి వృద్ధుల వరకు కంటి సమస్య ఉన్నవారు కంటి సమసయలున్నవారు పరీక్షలు చేయించుకోవాలనానరు. ఉచితంగా కళ్లద్దాలు సరిపడు మందులు, డ్రాప్స్ తీసుకొని కంటి సమస్యను పరిష్కరించుకోలని సూచించారు. కార్యక్రమంలో ,ఆరోగ్యశాఖ అధికారులు, మున్సిపల్ అధికారులు, మహిళా సంఘాల ఆర్పీలు, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఇల్లులేనివారికి ఇంటిస్థలం ఇవ్వాలి

- స్థలం ఉన్నవారికి 10 లక్షలు ఇవ్వండి
- ప్రజా పంథా జిల్లా సహాయ కార్యదర్శి ప్రభాకర్

నవతెలంగాణ-ఆర్మూర్

ఇల్లు లేని వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, స్థలం ఉన్నవారికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 10 లక్షల రూపాయలను ఇవ్వాలని ప్రజాపంథ జిల్లా సహాయ కార్యదర్శి వి ప్రభాకర్ అన్నారు పట్టణంలోని కుమార్ నారాయణ భవనంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో పేదవాళ్లు బతకడం చాలా కష్టమైతుందని తినడానికి తిండి కట్టుకోవడానికి బట్ట ఉండడానికి గూడు లేక తీవ్ర ఇబ్బందులకు లోనవుతున్నారని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఇల్లు లేని వారికి ఇల్లు నిర్మిస్తా అని సాక్షాత్తు అసెంబ్లీలో చెప్పిన నేటికీ అమలుకు నోచు కోలేదని అన్నారు. లక్షలాది మంది ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్ రూములు కోసం వేచి ఉంటే వందల్లో డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించడం పట్ల నిరసన వ్యక్తం చేశారు. పంపకాలలో పూర్తిగా అవకతవకాలు జరుగుతున్నాయని అన్నారు. సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు

దళిత రత్న అవార్డు గ్రహీతకు సన్మానం



లింగంను సన్మానిస్తున్న సర్పంచులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కోనేపల్లి గ్రామానికి చెందిన రోడ్డ లింగంకు దళిత రత్న అవార్డు రావడంతో స్థానిక సర్పంచులు ఆయనను గురువారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బాగేపల్లి సర్పంచ్ పాముల సాయిలు, వీరన్న గుట్ట తాండ సర్పంచ్ జాదవ్ గణేష్ నాయక్, డాక్టర్ ఎంపీటీసీ భర్త లతా భూమేష్, గండిగుట్ట సర్పంచ్ భర్త కృష్ణారావు, కిసాన్ తాండ సర్పంచ్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురు పేకాటరాయుళ్లు అరెస్టు

3680 నగదు, పేక ముక్కలు స్వాధీనం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని మూడవ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి పేకాట ఆడుతున్నారనే పకాక సమాచారంతో దాడి నిర్వహించగా ఏడుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసి వారి వద్ద నుండి 3680 రూపాయలు 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు మూడవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ శ్రావణ్ కుమార్ గురువారం తెలిపారు. దుబ్బ లో ఒక ఇంట్లో ఏడుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నారని సమాచారం రాగా ఎస్ఐ శ్రావణ్ కుమార్ సిబ్బంది వెళాలరు. పేకాట ఆడుతున్న ఏడు గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారివద్దగల నగదు 3,680, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు.

డ్రాపౌట్ నుంచి.. డాక్టరేట్

- డాక్టరేట్ పొందిన పేద గిరిజన బిడ్డ గుగ్లోత్ శంకర్
- కూలి పని చేస్తూనే ఉన్నత చదువు
- బాల కార్మికులకు విద్యాబోధన..
- సాక్షర భారత్ కోఆర్డినేటర్‌గా ప్రశంసలు..
- స్వచ్ఛభారత్, ప్లాస్టిక్ నిషేధంపై యూనిసెఫ్, స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డులు

నవతెలంగాణ-నవీపేట్



బాలకార్మికులను విద్యావంతులను చేసి వారి తల్లిదండ్రులకు అప్పగింత



అప్పటి కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న శంకర్

జీవితంలో ఎన్ని కష్టాలు అవాంతరాలు వచ్చినా కసి కోరిక పట్టుదల ఉంటే ఉన్నత ఆశయాలను సాధించవచ్చని నిరుపేద గిరిజన యువకుడు నిరూపించాడు. నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండల కేంద్రంలోని దర్యాపూరు తండాకు చెందిన గుగ్లోత్ శంకర్ నాయక్ తెలంగాణ యూనివర్సిటీలో స్వచ్ఛ భారత్ మిషన్‌లో మీడియా వినియోగంపై పరిశోధనలతో డాక్టరేట్ పట్టా పొందాడు. బడుగు, బలహీన, గిరిజన పేద విద్యార్థులకు ఉన్నత చదువులు అందించాలనే ఫూలే, అంబేద్కర్ ఆశయ సాధనకు తన వంతు కృషి చేస్తానని పేర్కొంటున్నాడు. అంబేద్కర్ జయంతి పురస్కరించుకొని ప్రత్యేక కథనం

బాల్యంలోనే ప్రాథమిక విద్యా దశలో డ్రాప్ అవుట్ అయిన శంకర్ పశువుల కాపరిగా కూలికి వెళ్ళగా వరి చేనులో గేదె మేయడంతో పొలం యజమాని చితకబాదాడు. దీంతో బాధను తట్టుకోలేక పొలం గట్టుపై ఏడుస్తుంటే అదే సమయంలో తన చెల్లెలు మిత్రులతో కలిసి ఆడుతూ పాడుతూ కేరింతలతో పరిగెత్తుకుంటూ వస్తుంటే చూసి జీవితంలో ఆనందం చదువుతూనే వస్తుందనిపించింది. ఆలోచన వచ్చిందే తడువు.. తర్వాతిరోజు తెల్లవారుజామున రెండు జతల బట్టలు తీసుకొని ఇంటి నుండి పారిపోయి చౌరస్తాలో తాగిపడేసిన ఖాళీ బీరు సీసాలు తీసుకొని అమ్మి వచ్చిన డబ్బులతో రైలు ఎక్కి ఉప్పల్ వాయిలోని పెద్దమ్మ కుమారుడు హరి వద్దకు పారిపోయి చదువుకుంటానని వేడుకోవడంతో పాఠశాలలో చేర్పించారు. చదువుకుం టూనే రాత్రిపూట బెల్లం తయారు చేసేందుకు కూలికి వెళ్లడం పండగల సెలవులలో హెూటల్లో పనిచేస్తూ పదవ తరగతి పూర్తి చేశాడు.

స్కాలర్షిప్‌తోనే ఇంటర్..

పదో తరగతి పాస్ అయిన తర్వాత స్వగ్రామం దర్యాపూర్ తాండకు రావడం పెద్ద కుటుంబం, అతిపెదరికం కారణంగా కుటుంబ భారంతో మళ్లీ కూలి పనులకు సిద్ధమవుతున్న సమయంలో స్థానిక ప్రైవేట్ కాలేజ్ ప్రిన్సిపల్ ఫీజు లేకుండా కేవలం స్కాలర్షిప్ తోనే చదివిస్తానని కాలేజీలో చేర్పించారు. అప్పుడు వ్యవసాయ కూలీతోపాటు శనివారం మేకల సంతలో కూలికి వెళ్లి ఇంటర్ పూర్తి చేశాడు. డిగ్రీ చదువుల కోసం పెద్దన్న భీమ్‌రావు క్లాస్మెట్ అయిన ప్రస్తుత సర్పంచ్ ఏటీఎస్ శ్రీనివాస్ దగ్గర కారు డ్రైవర్‌గా, డిగ్రీ రెండో సంవత్సరంలో జిల్లా కోర్టులో మున్సిఫ్‌గా మూడో సంవత్సరంలో బాల కార్మికుల వసతి గృహం (ఆర్ బి సి) ఇన్ స్ట్రక్టర్‌గా పనిచేశాడు. 14 సంవత్సరాల లోపు బడి బయట పిల్లలను గుర్తించి చేర్పిస్తుండటంతో.. నలుగురు విద్యార్థులు ఉన్న ఆర్‌బిసిలో 400 మంది బాల కార్మికులను విద్యా బోధిస్తూ విద్యావంతుడిగా చేయడంతో స్థానిక నాయకుల, అధికారుల మన్ననలు పొందారు. అప్పటి మంత్రి సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు స్పందించి తన కృషితో బాల కార్మికులకు దుస్తులను పంపిణీ చేశారు. అనంతరం నిజామాబాద్ మండలం జలాల్‌పూర్ లో విద్యా వాలంటరీగా చేస్తూ డిగ్రీ పూర్తి చేసి పీజీ ప్రవేశ పరీక్ష మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం కోర్సులో సీటు సాధించి ఎంఏ పూర్తి చేశాడు.

సాక్షర భారతి మండల కోఆర్డినేటర్ గా...

వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో మండల సాక్షర భారత్ కోఆర్డినేటర్ గా ఎంపికై 24 గ్రామపంచాయ తీలలో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్ది విద్య, ఉపాధి, వైద్యంపై అనేక అవగాహన కార్యక్రమాలు చేపట్టడంతో ఉన్నతాధికారుల ప్రశంసలతో పాటు అవార్డులూ అందుకున్నారు. అనంతరం ఆర్డబ్ల్యూఎస్ శాఖలో జిల్లా స్వచ్ఛ భారత్ మిషన్‌లో ఐఇసి కన్సల్టెంట్‌గా, కామారెడ్డి జిల్లాలో ఎస్‌బిఎం, ఐఈసి అండ్ హెచ్‌ఆర్డి కన్సల్టెంట్ గా ప్రతి గ్రామంలో మరుగుదొడ్ల నిర్మాణం కోసం కృషిచేసి 100 శాతం మరుగుదొడ్లు పూర్తి చేసి బహిరంగ మలమూత్ర విసర్జన లేని గ్రామాలుగా ప్రకటించడం, గ్రామాలలో గౌరవ యాత్రలు నిర్వహించడం ప్లాస్టిక్ నిషేధం కోసం "ప్రతి ఒక కేజీ ప్లాస్టిక్‌కు మూడు కోడిగుడ్లు ఉచితం" వంటి వినూత్న కార్యక్రమాలు చేపట్టి రెండవ ఏడాదిలోపు లక్ష మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేసి యునిసెఫ్ స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డులు పొంది జిల్లా కలెక్టర్‌లతో శభాష్ శంకర్ అనిపించుకున్నాడు. గ్రామీణ స్వచ్ఛభారత్ నుండి పట్టణ స్వచ్ఛభారత్ కు మున్సిపల్ శాఖలో స్టేట్ ఎస్ డబ్ల్యూ ఎం, ఐఏసి, ఎక్స్‌పర్ట్‌గా విధులు నిర్వహించి అందరి మన్ననలు పొందాడు.

మాస్ కమ్యూనికేషన్ లో డాక్టరేట్ పట్టా..

తెలంగాణ యూనివర్సిటీ మాస్ కమ్యూనికేషన్ విభాగంలో 2023 మార్చ్ 31వ తేదీన డాక్టర్ వై ప్రభంజన్ యాదవ్ పర్యవేక్షణలో "ద యూస్ ఆఫ్ మీడియా ఇన్ స్వచ్ఛభారత్ మిషన్" అనే అంశంపై గుగ్లోత్ శంకర్ నాయక్ పరిశోధన గ్రంథం సమర్పించి తెలంగాణ యూనివర్సిటీ మినీ సెమినార్ హాల్లో పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టా పొందారు. ప్రాథమిక దశలోనే చదువు ఆగినా కుటుంబ పరిస్థితి అంతంతగా ఉన్నా.. బానిసత్వం పోయి స్వేచ్ఛగా జీవించాలనే పట్టుదలతో కృషి చేసి చదువుకుంటూ చదువు చెప్తూ కొనసాగుతూ చివరకు డాక్టరేట్ పట్టా సొంతం చేసుకున్న ఆయన.. ఆదర్శంగా నిలుస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు.

పేద విద్యార్థుల ఉన్నత చదువులకు కృషి చేస్తా..

డాక్టర్ గుగ్లోత్ శంకర్ నాయక్



బడుగు, బలహీన, గిరిజన పేద విద్యార్థులకు ఉన్నత చదువులు అందించేందుకు కృషి చేస్తాను. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడంతోపాటు గ్రామీణ, పట్టణ ప్రజలకు పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రతపై బాధ్యత ను తెలియజేస్తూ అవగాహనను కల్పిస్తాను. యువతకు విద్య, ఉపాధి, వైద్యం మరియు రాజకీయాలపై అవగాహన కల్పిస్తూ చైతన్యం చేసేందుకు నా వంతుగా కృషి చేస్తాను. తల్లిదండ్రులు లేని అనాథలను విద్యావంతులను చేస్తాను.

నేడు అంబేద్కర్ విగ్రహావిష్కరణ

- తరలివెళ్లేందుకు లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలి
- టెలీ కాన్ఫరెన్స్‌లో మండల అధికారులకు కలెక్టర్ ఆదేశం

నవతెలంగాణ-కామారెడ్డి



టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

హైదరాబాదులో నేడు 125 అడుగుల అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆరు బస్సుల ద్వారా 300 మంది ప్రజలను తరలించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. గురువారం టెలి కాన్ఫరెన్స్ ద్వారా మండల స్థాయి అధికారులతో విగ్రహావిష్కరణ కార్యక్రమం పై సమీక్ష నిర్వహించారు. మండల కేంద్రాల నుంచి శుక్రవారం ఉదయం 6 గంటలకు బస్సులలో ప్రజలను హైదరాబాద్‌కు తరలించాలని తెలిపారు. మధ్యాహ్నం ఒంటిగంటకు తప్పనిసరిగా విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ప్రజలు చేరుకునే విధంగా అధికారులు చూడాలని చెప్పారు. ప్రజలకు టిఫిన్, మధ్యాహ్న భోజనం, డిన్నర్, తాగునీరు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రతి బస్సులో ఒక పోలీస్ అధికారి, నోడల్ అధికారి ఉండే విధంగా ఏర్పాటు చేశామని తెలిపారు. బస్సులు తిరిగి మండల కేంద్రానికి చేరేవరకు జిల్లా స్థాయి అధికారులు పర్యవేక్షణ చేయాలని అధికారులకు సూచించారు. టెలికాన్ఫరెన్స్‌లో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేష్ దోత్రే, శిక్షణ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ డీఆర్‌డీవో సాయన్న, డీపీవో శ్రీనివాస్‌రావు, డిఎల్‌పిఓ సాయిబాబా, ఆర్డీవోలు శ్రీనివాస్‌రెడ్డి, శీను, రాజా గౌడ్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

రోడ్డుపై వరి ధాన్యం ఆరపెట్టొద్దు



మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి

నవతెలంగాణ-బిచ్కుంద

రైతులు పండించిన వరి ధాన్యం రోడ్డుపై ఆరపెట్టవద్దని వాహనదారులకు ఇబ్బంది కలిగించవద్దని బిచ్కుంద ఎస్సై శ్రీధర్ రెడ్డి అన్నారు. గురువారం బిచ్కుంద మండలంలోని హస్గుల్ గ్రామంలోని రైతు వేదికలో రైతులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన వరి ధాన్యాన్ని రోడ్లపై ఎండబెట్టకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని రాత్రి సమయంలో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని కొన్ని సమయాల్లో వాహనదారులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. తప్పని పరిస్థితిలో రోడ్డుపై వరి ధాన్యం పోసి ఆరబెట్టినా.. హెచ్చరికలు బోర్డులు ఏర్పాటు చేసి రాత్రి సమయంలో కనబడే విధంగా రేడియం స్టిక్కర్లు అతికించాలన్నారు. ప్రమాదాలు జరిగి వాహనదారులు గాయాల పాలైన మృతి చెందిన వరిధాన్యం కుప్పల యజమానిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ భరత్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ సాయిబాబా, సర్పంచ్, వార్డ్ మెంబర్లు, రైతులు ప్రజలు ఉన్నారు.

బీజేవైఎం మండల ఉపాధ్యక్షుడిగా మహేశ్వరం రవి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి భారతీయ జనతా పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో భారతీయ జనతా యువమోర్చా మండల మూడవ ఉపాధ్యక్షునిగా అల్మాజిపూర్ గ్రామానికి చెందిన మహేశ్వరం రవిని నియమించినట్లు బీజేవైఎం మండల అధ్యక్షులు నరేష్ తెలిపారు. ఈ నియామకపత్రాన్ని ఎల్లారెడ్డి మాజీ శాసనసభ్యులు ఏనుగు రవీందర్‌రెడ్డి చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న వ్యక్తికి సన్మానం

నవతెలంగాణ-నవీపేట్



నవీ పేట్ పోలీస్ స్టేషన్‌లో కోర్ట్ మున్సిఫ్‌గా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న చౌహాన్ రాజుకు నవీపేట్ ఎస్సై రాజారెడ్డి గురు వారం ఘనంగా సత్కరించారు. గత కొన్ని సంవత్సరాలుగా కోర్టు విధులు నిర్వహించి మూడు సార్లు కమిషనర్ ఆఫ్ పోలీస్ వారితో పురస్కారాలు అందుకొని నవీపేట్ నుంచి బదిలీ అయినట్టు తెలిపారు.

బస్సు పాసుల కోసం దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-భిక్కనూర్

మండల కేంద్రంలోని గ్రామ సచివాలయంలో గురువారం దివ్యాంగుల కోసం బస్ పాస్‌ల దరఖాస్తు స్వీకరించినట్లు విజ్ఞాన్ వికలాంగుల సేవా సమితి జిల్లా అధ్యక్షులు బాల్ రెడ్డి తెలిపారు. కామారెడ్డి ఆర్టీసీ డిపో మేనేజర్ మల్లేశం ఆదేశాల మేరకు దివ్యాంగుల వారి నుండి దరఖాస్తులు స్వీకరించి త్వరలోనే దివ్యాంగులకు బస్ పాసులు జారీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది సత్యం, పంచాయతీ కార్యదర్శి సహదేవ్, వార్డు సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘానికి 30గుంటల భూమి కేటాయింపు

హర్షం వ్యక్తం చేస్తున్న మున్నూరు కాపులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి



కేటీఆర్‌కు వినతిపత్రం అందజేసిన బాజిరెడ్డిజగన్

నిజామామాబాద్ జిల్లా మున్నూరు కాపు సంఘం అధ్యక్షులుగా ఎన్నికైన తర్వాత మొదటిసారిగా బాజిరెడ్డి జగన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని మ్యారిగోల్డ్ హెూటల్లో రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కల్వకుంట తారకరామారావును గురువారం కలిశారు. నిజామాబాద్ జిల్లాలో మున్నూరుకాపు విద్యార్థులకు వసతి గృహ ఏర్పాటుకు పాంగ్రా గ్రామంలో ఉన్న 30 గుంటల ప్రభుత్వ భూమిని సంఘానికి కేటాయించాలని వినతి పత్రం అందజేశారు. ఈ ప్రతిపాదనలు గతంలో ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ప్రభుత్వానికి పంపి ఉన్నారని, అది ప్రస్తుతం రాష్ట్ర సచివాలయంలో సిసిఎల్‌లో ఉందని కేటీఆర్‌కు వివరించారు. వెంటనే స్పందించిన కేటీఆర్ సీసీఎల్ కమిషనర్ నవీన్ మిట్టల్‌తో ఫోన్లో మాట్లాడి ఆ భూమిని జిల్లా మున్నూరు కాపు సంఘానికి మంజూరు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన తర్వాత మొదటి సారి మున్నూరు కాపు విద్యార్థుల కొరకు కృషి చేస్తున్న బాజిరెడ్డి జగన్ ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో జిల్లాలోని మున్నూరు కాపులు గోర్త రాజేందర్, గాండ్ల లింగం పటేల్, నర్సింగరావు పటేల్, కిషన్ రెడ్డి పటేల్, కుంట సంజీవ్ పటేల్, బంటు మహిపాల్, పుప్పల రవి, మధు, సాంబార్ మోహన్, కుర్వ దేవేందర్ , లక్ష్మీ నర్సయ్య, గాదే కృష్ణ , ఎండల ప్రదీప్, పులి సాగర్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ విద్య సాధనకు పోరాడుదాం

- పీడీఎస్‌యూ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



మాట్లాడుతున్న నాయకులు

శాస్త్రీయ విద్య సాధనకు పోరాడుదామని పీడీఎస్‌యూ నాయకులు అన్నారు. జార్జి రెడ్డి 51 వ వర్ధంతి సందర్భంగా పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో గిరిరాజా ప్రభుత్వ కళాశాలలో సభను గురువారం నిర్వహించారు. నిజామాబాద్ నగర అధ్యక్షులు ఎస్.కే. అశూర్ అధ్యక్షతన, ముఖ్య వక్తగా విచ్చేసిన ఆల్లొట్ రవీందర్, పౌరహక్కుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎం.సుధాకర్-పీడీఎస్‌యూ మాజీ ఉపాధ్యక్షులు, కర్క గణేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.. దేశంలో ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా ఎన్నో విద్యార్థులు ఉద్యమాలు జరుగుతున్నాయని, దేశంలో [illegible] విశ్వవిద్యాలయాల్లో నూతన జాతీయ విద్యా విధానాన్ని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం అనుకుంటుందని, ఈ విద్యా విధానం వల్ల దేశంలోనే అట్టడుగు వర్గాలకు ఉన్నత విద్య అందని ద్రాక్షలా ఉందని, ఆనాడు ఉస్మానియా యూనివర్సిటీలో మ[illegible]్లాడానికి, కులం ఉన్మాదానికి వ్యతిరేకంగా నిలబడి రక్తాన్ని చిందించిన జార్జి రెడ్డి స్ఫూర్తితో విద్యార్థులు ఉద్యమాలలో పాల్గొని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అన్ని రకాల పేపర్లను లీకేజీలు చేసి విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో చెలగాట మాడుతున్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా విద్యార్థులు జార్జిరెడ్డి స్ఫూర్తితో పోరాటాలు చేసి డిమాండ్లను సాధించుకోవాలని అన్నారు. అనగారిన వర్గాలకు ఉన్నతమైన విద్యను దూరం చేసే నూతన జాతీయ విద్యా విధానాన్ని 2020ని రద్దు చేయాలని, జార్జి రెడ్డి స్ఫూర్తితో ఉద్యమిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు అనీల్, కళాశాల నాయకులు సందీప్, కిషన్, రోహిత్, దీక్షిత్, మమత, అఖిలేష్ విద్యార్థులు పాల్గొన్నారు.